http://www.agnidharanews.com

# అగ్నిధార

నిజాల నిప్పు కణిక

బుధవారం 16 అక్టోబర్ 2024

ఎడిటర్: చేగొండ రవి కుమార్ యాదవ్

పేజీలు : 5 వెల : 5/-

Published from Peddapalli Ciculated by Hyderabad, , , Sangareddy, jagityala, Rangareddy, Khammam,Medchal Medak Siddipet, Nalgonda, , warangal, Nizamabad

## విలేకరులు కావలెను

ప్రజా గళాన్ని బలంగా వినిపిస్తూ.. అవినీతిపై సమరాన్ని సాగిస్తున్న అగ్నిధార తెలుగు దినపత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల వారికి అవకాశం కలదు. అన్ని జిల్లాలు, డివిజన్లు, మున్సిపల్ మరియు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను.

ఆసక్తి కలిగినవారు సంప్రదించగలరు

సెల్ : 80088 17828

# కలిసి పని చేస్తాం

## దేశ భద్రత విషయంలో రాజకీయాలు తగవు

## కేంద్ర మంత్రి రాజ్ నాథ్ సింగ్

- దేశ రక్షణ విషయంలో రాజీ పడోద్దు
- వీఎల్ఎఫ్ ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్
- దేశ రక్షణలో తెలంగాణ రాష్ట్రం మరో కీలక అడుగు ముందుకు వేయబోతోంది
- దేశ రక్షణకు సంబంధించి కీలకమైన డిఫెన్స్,ఎన్.ఎఫ్.సీ లాంటి కేంద్రాలకు హైదరాబాద్ గుర్తింపు పొందింది.
- వీఎల్ఎఫ్‌తో ప్రజలకు అన్యాయం జరుగుతుందని అపోహలు కలిగించే ప్రయత్నం చేస్తున్నారు.
- దేశంలో రెండో వీఎల్ఎఫ్ మన ప్రాంతంలో రావడం గర్వకారణం



వికారాబాద్

రాజకీయాలకతీతంగా రాష్ట్ర అభివృద్ధి కోసం కేంద్రంతో కలిసి పని చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. దేశంలో అతిపెద్ద రాడార్ స్టేషన్ గా పూడూరు మండలంలో ఏర్పాటు చేసిన కేంద్రం నిలుస్తుందని సీఎం అన్నారు. వికారాబాద్ జిల్లా పూడురు మండలంలో భారత నేవీ ఏర్పాటు చేస్తోన్న రాడార్ స్టేషన్ శంకుస్థాపన కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి, కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, రాష్ట్ర మంత్రి కొండా సురేఖ, ఎంపీ కొండా విశ్వేశ్వరరెడ్డి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. రాడార్ స్టేషన్ కు భూమిపూజ చేసిన అనంతరం సీఎం మాట్లాడుతూ.. దేశ రక్షణలో తెలంగాణ భాగస్వామ్యం కీలకమన్నారు. రాడార్ స్టేషన్ పై కొందరు లేనిపోని అపోహలు సృష్టిస్తున్నారన్నారు. దేశ ప్రయోజనాలకు సంబంధించిన విషయాన్ని కూడా రాజకీయం చేయడం తగదన్నారు. బీఆర్ఎస్ పదేళ్లు అబద్ధాలు చెప్పిందని... ఇప్పుడు - మిగతా3లో



## గ్రూప్ 1 మెయిన్స్ పరీక్షకు

# లైన్ క్లియర్

- వివిధ కారణాలతో గ్రూప్ 1 ప్రిలిమ్స్ పరీక్షలపై హైకోర్టులో అభ్యర్థులు పలు పిటిషన్‌లు
- గ్రూప్ 1 ప్రిలిమ్స్ పరీక్షలపై దాఖలైన రెండు పిటిషన్లను హైకోర్టు కొట్టివేసింది.
- ప్రిలిమీనరీ కీ లో తప్పులు ఉన్నాయని, కీ ని రీ నోటిఫికేషన్ చేయాలని మరో పిటిషన్‌ను అభ్యర్థులు దాఖలు

హైదరాబాద్

గ్రూప్ -1 మెయిన్స్ పరీక్షకు లైన్ క్లియర్ అయ్యింది. గ్రూప్ 1 ప్రిలిమ్స్ పిటిషన్లను హైకోర్టు డిస్మిస్ చేసింది. వివిధ కారణాలతో గ్రూప్ 1 ప్రిలిమ్స్ పరీక్షలపై హైకోర్టులో అభ్యర్థులు పలు పిటిషన్‌లు దాఖలు చేశారు. మంగళవారం ఉదయం ఈ పిటిషన్లపై హైకోర్టులో విచారణకు వచ్చింది. - మిగతా3లో



## ఐఏఎస్‌లకు చుక్కెదురు

- డీవోపీటీ ఇచ్చిన ఆదేశాలు పాటించాలన్న క్యాట్
- ఇటీవల సొంత రాష్ట్రాల క్యాడర్ లకు పలువురు ఐఏఎస్‌ల బదిలీ
- క్యాట్‌ను ఆశ్రయించిన ఆమ్రపాలి, వాకాటి కరుణ, వాణీ ప్రసాద్, సృజన
- నేడు ఐఏఎస్‌ల పిటిషన్లను విచారించిన క్యాట్
- డీవోపీటీ ఉత్తర్వులపై మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చేందుకు నిరాకరణ

## అమెరికా-భారత్ మధ్య భారీ డిఫెన్స్ డీల్..

- రూ.31వేలకోట్లతో ప్రిడేటర్ డ్రోన్స్ కొనుగోలుకు ఒప్పందం..
- ఈ ఒప్పందం విషయంలో ఇరుదేశాల మధ్య చాలాకాలంగా చర్చలు
- ఈ డ్రోన్ల సహాయంతో మరింత పెరగనున్న భారతదేశ నిఘా సామర్థ్యం
- ఈ ఒప్పందానికి రక్షణ వ్యవహారాల కేబినెట్ కమిటీ గతవారం ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే
- 15 డ్రోన్స్ నేవికి, మరో ఎనిమిది వైమానిక దళం, మరో ఎనిమిది ఆర్మీకి కేటాయింపు



## ఇందిరమ్మ రాజ్యమని దళారుల రాజ్యం తెచ్చారు

- వెంటనే రీయింబర్స్‌మెంట్ బకాయిలు, స్కాలర్‌షిప్‌లు చెల్లించాలి
- గురుకుల భవనాలకు అద్దె చెల్లిస్తలేరు
- కాలేజీల యాజమాన్యాలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇస్తలేరు
- లక్షలాది మంది విద్యార్థుల జీవితాలతో రేవంత్ రెడ్డి సర్కార్ చెలగాటమాడుతోంది.
- ట్విటర్ వేదికగా కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు



హైదరాబాద్

రాష్ట్రంలో విద్యారంగాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా భ్రష్టు పట్టించిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పెండింగ్‌లో ఉన్న రీయింబర్స్‌మెంట్ బకాయిలు, స్కాలర్‌షిప్‌లను వెంటనే చెల్లించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. గురుకుల భవనాలకు అద్దె చెల్లిస్తలేరు. కాలేజీల యాజమాన్యాలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇస్తలేరు. కనీసం అన్నం పెట్టలేని స్థితికి కాంగ్రెస్ ప్రభుత్వం దిగజారిందని కేటీఆర్ విమర్శించారు. చదువు పక్కనపెట్టి విద్యార్థులు, కాలేజీ యాజమాన్యాలు రోడ్లపై ధర్నాలు చేసే దుస్థితి తెచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా డిగ్రీ, పీజీ ప్రైవేట్ కాలేజీలను నిరవధికంగా మూసివేయటంతో విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు - మిగతా3లో





## ప్రజల ఆశయాలకు అనుగుణంగా ప్రభుత్వం పనిచేస్తుంది

- ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి విరివిగా తీసెళ్లాలి
- క్రమశిక్షణ అనేది చాలా కీలకం.. క్రమశిక్షణ ఉల్లంగిస్తే ఊరుకునేది లేదు
- మెదక్ జిల్లా సమావేశంలో టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్

హైదరాబాద్

రాష్ట్రములో ప్రజల ఆశయాలకు అనుగుణంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ అన్నారు.మంగళవారం గాంధీ భవన్ లో జరిగిన మెదక్ జిల్లా నేతల సమావేశంలో పాల్గొని ప్రసంగించారు.ఎన్నికలలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో మనం ముందున్నం,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు అద్భుతమైన పాలన చేస్తున్నారన్నారు. ఇందిరమ్మ ఇళ్ల ఇస్తున్నాం.. ఉద్యోగాల కల్పన చేసాము. బస్‌లలో - మిగతా3లో

## సీతక్క ఉత్తమ్‌లకు

# కీలక బాధ్యతలు

- మహారాష్ట్ర, ఝార్ఖండ్ ఎన్నికల ప్రచారానికి తెలంగాణ నేతలు
- జార్ఖండ్ సీనియర్ పరిశీలకుడిగా భట్టి విక్రమార్క
- మరాట్వాడా డివిజన్‌కు సచిన్ పైలట్, ఉత్తమ్ కుమార్ రెడ్డి
- ఉత్తర మహారాష్ట్ర డివిజన్‌కు సీతక్క, డాక్టర్ నసీర్ హుస్సేన్
- ముంబయి, కొంకన్, విదర్భా, పశ్చిమ మహారాష్ట్ర డివిజన్లకు సీనియర్ నేతలు ముకుల్ వాస్నిక్, అవినాశ్ పాండే



హైదరాబాద్/ఢిల్లీ

మహారాష్ట్ర, ఝార్ఖండ్ ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ సీనియర్ పరిశీలకులను నియమించింది. ఇందుకు సంబంధించి ఏఐసీసీ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ జాబితాలో తెలంగాణ నుంచి ముగ్గురికి చోటు కల్పించింది. మహారాష్ట్రలోని 5 డివిజన్లకు 11 మందిని నియమించగా.. వీరిలో తెలంగాణ నుంచి మంత్రులు సీతక్క, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఉన్నారు. జార?ండ్?కు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో పాటు ఆ పార్టీ సీనియర్ నేతలు అధిర్ రంజన్ చౌదరి, తారిక్ అన్వర్‌ని - మిగతా3లో

## మోగిన ఎన్నికల నగారా..

- మహారాష్ట్ర, జార్ఖాండ్ ఎన్నికల షెడ్యూల్ ఇదే
- మహారాష్ట్రలో మొత్తం 288 స్థానాలకు ఒకే విడతలో ఎన్నికలు
- అక్టోబర్ 22న నోటిఫికేషన్ విడుదల.. 29వ తేదీ వరకూ నామినేషన్ల స్వీకరణ
- నవంబర్ 20న ఎన్నికలు నిర్వహించి.. 23న ఫలితాల వెల్లడి
- జార్ఖాండ్ 81 అసెంబ్లీ స్థానాలకు గానూ రెండు విడతల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు
- తొలి విడతలో 43 స్థానాలకు నవంబర్ 13న ఎన్నికలు
- మీడియాకు స్వీయ నియంత్రణ అవసరం. ఎన్నికల ప్రక్రియ మొత్తం వెబ్‌కాస్టింగ్ చేస్తున్నాం
- ఫిర్యాదుల స్వీకరణకు సీ విజిల్ యాప్ అందుబాటులో ఉంటుంది
- సీఈసీ రాజీవ్ కుమార్



# అమెరికా-భారత్ మధ్య భారీ డిఫెన్స్ డీల్

అగ్రరాజ్యం అమెరికాతో భారీ డీల్ కుదుర్చుకున్నది. 31 ప్రిడేటర్ డ్రోన్లను కొనుగోలు చేసేందుకు ఇరుదేశాలు ఒప్పందాలపై సంతకాలు చేసినట్లు ఓ అధికారి వెల్లడించారు. ఈ ఒప్పందం విషయంలో ఇరుదేశాల మధ్య చాలాకాలంగా చర్చలు జరుగుతున్నాయి. ఈ డీల్ రూ.32వేలకోట్ల విలువ ఉంటుందని ఆ అధికారి పేర్కొన్నారు. ఈ డ్రోన్ల సహాయంతో భారతదేశ నిఘా సామర్థ్యం మరింత పెరగనున్నది. ఈ ఒప్పందానికి రక్షణ వ్యవహారాల కేబినెట్ కమిటీ గతవారం ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. భారత్‌లో జరిగిన కార్యక్రమంలో ఇరు దేశాల ఉన్నతాధికారులు, సైనికాధికారుల సమక్షంలో ఒప్పందం కుదిరింది. హిందూ మహాసముద్రంలో భారత్ నిఘా సామర్థ్యం భారీగా పెరగనుంది. గత ఏడాది ప్రధాని మోదీ అమెరికా పర్యటన సందర్భంగా 31 ప్రిడేటర్ డ్రోన్‌లను కొనుగోలుపై భారత్ రక్షణ ఒప్పందాన్ని ప్రకటించింది. ఒప్పందంపై యూఎస్ స్టేట్ డిపార్ట్‌మెంట్ ప్రతినిధి మాథ్యూ మిల్లర్ మాట్లాడుతూ.. రెండుదేశాల మధ్య వ్యూహాత్మక సాంకేతిక సహకారం, సైనిక సహకారాన్ని గణనీయంగా పెంచుతుందని చెప్పారు. ప్రిడేటర్ డ్రోన్స్ ఎంక్యూ-9బీ కొనుగోలుతో హిందుమహాసముద్రంలో భారత నైకాదళం నిఘా సామర్థ్యం భారీగా పెరుగుతుందని రక్షణరంగ నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ



ప్రిడేటర్ డ్రోన్‌లను అమెరికన్ కంపెనీ జనరల్ అటామీక్స్ నుంచి కొనుగోలు చేయనున్నారు. భారత్, అమెరికా మధ్య విదేశీ సైనిక ఒప్పందం ప్రకారం ఈ డీల్ జరిగింది. డీల్‌లో భాగంగా 31 ప్రిడేటర్ డ్రోన్లను అమెరికా భారత్‌కు అందించనున్నది.

డ్రోన్ల నిర్వహణ, మరమ్మతులను దేశంలోనే చేసేందుకు ఫెసిలిటీని ఏర్పాటు చేయనున్నారు. ఇందులో 15 డ్రోన్స్ నేవికి, మరో ఎనిమిది వైమానిక దళం, మరో ఎనిమిది ఆర్మీకి కేటాయించనున్నారు. హిందూ మహాసముద్రంలో చైనా తన ప్రాభవాన్ని పెంచుకునేందుకు ప్రయత్నిస్తున్నది. ఈ క్రమంలోనే భారత్ సైతం తన నిఘా సామర్థ్యాన్ని మరింత పెంచుకుంటూ వస్తున్నది. ఈ ప్రిడేటర్ డ్రోన్స్ ప్రత్యేక ఏంటంటే.. దాదాపు 40వేల అడుగుల కంటే ఎక్కువ ఎత్తులో దాదాపు 40 గంటలు ఎగురుతాయి. రకరకాల వాతావరణ పరిస్థితుల్లోనూ ఎగిరే సత్తా వీటి సొంతం. ప్రిడేటర్ డ్రోన్లను మానవతా సహాయం, విపత్తుల సమయంలో శోధన, రెస్క్యూ ఆపరేషన్, యాంటీ-సర్ఫేస్ వార్‌ఫేర్, యాంటీ సబ్‌మెరైన్ వార్‌ఫేర్, ఎయిర్‌బోర్న్ మైన్ కౌంటర్‌మెజర్లు ఉపయోగించవచ్చు. దాడులు సైతం చేయొచ్చు. 2022 జూలైలో ఈ డ్రోన్ సహాయంతో యూఎస్ హెల్‌ఫైర్ క్షిపణిని ప్రయోగించి అల్‌ఖైదా ఉగ్రవాది ఐమన్ అల్ జవహరిని హతమార్చింది. ఈ డ్రోన్ హెల్‌ఫైర్ క్షిపణితో పాటు 450 కిలోల పేలుడ్‌తో ఎగురుతుంది. ప్రిడేటర్ డ్రోన్‌లను తయారు చేసే జనరల్ అటామిక్స్, ఈ డ్రోన్ భాగాలను తయారు చేయడానికి భారత కంపెనీ భారత్ ఫోర్జ్‌తో ఇప్పటికే ఒప్పందం కుదుర్చుకుంది. ఈ డ్రోన్‌ల మరమ్మతులు, నిర్వహణ కోసం కంపెనీ భారతదేశంలోనే ఎంఆర్‌వో హబ్‌ను కూడా ఏర్పాటు చేస్తుంది. దాంతో పాటు కంపెనీ తన సొంత స్వదేశీ యుద్ధ డ్రోన్‌లను తయారు చేయడానికి భారత్‌కు సహకారం అందించనున్నది.

# మోగిన ఎన్నికల నగారా..

**న్యూఢిల్లీ:** దేశంలో మరోసారి ఎన్నికల నగారా మోగింది. మహారాష్ట్ర, జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించింది. మహారాష్ట్రలో మొత్తం 288 స్థానాలకు ఒకే విడతలో ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఈసీ ప్రకటించింది. ఇందుకోసం అక్టోబర్ 22న నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు పేర్కొంది. 29వ తేదీ వరకూ నామినేషన్ల స్వీకరణకు గడువు ఉండగా.. నామినేషన్ల ఉపసంహరణకు నవంబర్ 4 వరకు గడువు ఉంటుంది. ఇక నవంబర్ 20న ఎన్నికలు నిర్వహించి.. 23న ఫలితాలు వెల్లడించనున్నట్లు ఈసీ వివరించింది. రాష్ట్రంలో మొత్తం 9 కోట్ల 63 లక్షల మంది ఓటర్లు ఉండగా.. లక్షా 186 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపింది. కాగా, నవంబర్ 26తో మహారాష్ట్ర అసెంబ్లీ గడువు ముగియనుంది.

మరోవైపు జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికలకు కూడా ఈసీ షెడ్యూల్ విడుదల చేసింది. 81 అసెంబ్లీ స్థానాలకు గానూ రెండు విడతల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు. తొలి విడతలో 43 స్థానాలకు నవంబర్ 13న ఎన్నికలు జరగనున్నాయి. మిగిలిని 38 స్థానాలకు నవంబర్ 20న ఎన్నికలు ఉంటాయి. ఇక నవంబర్ 23న ఓట్ల లెక్కింపు చేపట్టి.. ఫలితాలు వెల్లడిస్తారు. రాష్ట్రంలో మొత్తం 2.6 కోట్ల మంది ఓటర్లు ఉండగా.. 29,562 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఈసీ తెలిపింది. ఇక వచ్చే ఏడాది జనవరి 5తో జార్ఖండ్ అసెంబ్లీ గడువు ముగియనుంది.

ఈ సందర్భంగా సీఈసీ రాజీవ్ కుమార్ మాట్లాడుతూ.. ఎన్నికల ప్రక్రియ మొత్తం వెబ్‌కాస్టింగ్ చేయనున్నట్లు తెలిపారు. ఫిర్యాదుల స్వీకరణకు సీ విజిల్ యాప్ అందుబాటులో ఉంటుందని చెప్పారు. మద్యం, డ్రగ్స్, కానుకలు పంపిణీ చేస్తే కఠిన చర్యలు ఉంటాయని




హెచ్చరించారు. ఆన్‌లైన్ వాలెట్‌లపైనా నిఘా ఉంటుందని.. సోషల్ మీడియాలో వచ్చే వార్తలపై నిఘా పెడుతున్నట్లు సీఈసీ తెలిపారు.

మరోవైపు జమ్ము కశ్మీర్, హర్యానా అసెంబ్లీ ఎన్నికల నిర్వహణపై కూడా సీఈసీ రాజీవ్ కమార్ మాట్లాడారు. 'జమ్ము కశ్మీర్, హర్యానా ఎన్నికలను విజయవంతంగా నిర్వహించాం. కశ్మీర్ ఎన్నికల నిర్వహణపై ప్రపంచ దేశాల నుంచి ప్రశంసలు అందాయి. ఉగ్రదాడులకు భయపడకుండా ప్రజలు ఓటేశారు. హింసాత్మక ఘటనలు ఒక్కటీ జరగకుండా ఎన్నికలు నిర్వహించాం. ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించినా కొందరు విమర్శలు చేస్తున్నారు' అని అన్నారు.

### ఎగ్జిట్ పోల్స్‌పై ప్రధాన ఎన్నికల కమిషనర్ కీలక వ్యాఖ్యలు

ఎగ్జిట్ పోల్స్ శాస్త్రీయతపై ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ కీలక ప్రశ్నలు సంధించారు. శాంపిల్ సైజ్, సర్వేలు ఎక్కడ జరిగాయి? అందుకు అనుగుణంగా ఫలితాలు రాకుంటే బాధ్యులెవరు? అని ప్రశ్నించారు. దీనిపై భాగస్వామ్య పక్షాలు ఆత్మ పరిశీలన చేసుకోవాల్సిన అవసరం ఉందని సూచించారు. మీడియాకు స్వీయ నియంత్రణ అవసరమని అన్నారు. మహారాష్ట్ర, జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ ప్రకటన సందర్భంగా ఆనయ ఈ కీలక వ్యాఖ్యల చేశారు. ఎగ్జిట్స్ పోల్స్‌తో తమకు ఎలాంటి సంబంధం ఉండదని, వాటికి ఎలాంటి శాస్త్రీయత లేనప్పటికీ భారీ అంచనాలనే సృష్టిస్తాయని చెప్పారు. ఇందువల్ల ప్రజల్లో గంగరగోళం ఏర్పడుతోందని, మీడియా ముఖ్యంగా ఎలక్ట్రానిక్ మీడియా ఆత్మపరిశీలన చేసుకోవాల్సి అవసరం ఉందని, స్వీయ నియంత్రణ అవసరమని సీఈసీ అన్నారు. ఓట్ల లెక్కింపు మొదలైన 15 నుంచి 30 నిమిషాల్లోనే టీవీ ఛానెల్స్ ఎర్లీ ట్రెండ్స్ చూపించడాన్ని సీఈసీ ప్రశ్నించారు. "ఎన్నికలు ముగిసిన సుమారు మూడోరోజు కౌంటింగ్ జరుగుతుంది. అయితే ఎన్నికలు ముగిసిన రోజు సాయంత్రం 6 గంటల నుంచే అంచనాలు పెరుగుతుంటాయి. కౌంటింగ్ మొదలైన తర్వాత 8.05-8.10 గంటల మధ్యనే ఫలితాలు మొదలు పెట్టేస్తారు. ఇదంతా నాన్సెన్స్. ఫస్ట్ కౌంటింగ్ 8.30 గంటలకు మొదలవుతుంది. తొలి ట్రెండ్స్ ఎగ్జిట్ పోల్స్‌ను జస్టిఫై చేస్తాయా?" అని రాజీవ్ కుమార్ ప్రశ్నించారు. ఉదయం 9.30 గంటలకు ఫలితాలు వెబ్‌సైట్‌లో పెట్టడం మొదలవుతుందని, వాస్తవ ఫలితాలు వచ్చేసరికి మిస్‌మ్యాచ్ కావచ్చని, ఒక్కోసారి ఇలాంటి మిస్‌మ్యాచ్ తీవ్ర సమస్యలకు కారణం కావచ్చని అన్నారు. అంచనాలు, ఫలితాలకు మధ్య అంతరం చివరకు నిరాశకు దారితీస్తుందన్నారు. దీనిపై మీడియా సహా సంబంధిత పార్టీలన్నీ ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన సమయం వచ్చిందని చెప్పారు. ఇటీవల ప్రకటించిన హర్యానా అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ఎగ్జిట్ పోల్స్ అంచనాలకు భిన్నంగా రావడం, దీనిపై కొన్ని పార్టీలు ఆరోపణలు చేసిన నేపథ్యంలో రాజీవ్ కుమార్ తాజా వివరణ ఇచ్చారు.

# 48 అసెంబ్లీ, రెండు లోక్‌సభ స్థానాలకు ఉప ఎన్నికలు

**న్యూఢిల్లీ :** మహారాష్ట్ర, జార?ండ్ అసెంబ్లీ ఎన్నికలతోపాటు దేశ వ్యాప్తంగా ఖాళీగా ఉన్న రెండు లోక్‌సభ, 48 అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికలకు షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం ఇవాళ ప్రకటించింది.

కేరళలోని వయనాడ్ లోక్‌సభ స్థానంతో పాటు దేశవ్యాప్తంగా ఖాళీగా ఉన్న 47 అసెంబ్లీ స్థానాలకు నవంబర్ 13న ఉప ఎన్నికలు ఉంటాయని తెలిపింది. ఇందుకోసం అక్టోబర్ 18న నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. 25న నామినేషన్ల స్వీకరణకు చివరి గడువు కాగా.. నామినేషన్ల ఉపసంహరణకు 30వ తేదీ వరకూ గడువు ఇచ్చింది.

ఇక నవంబర్ 13న ఎన్నికలు ఉంటాయి. 23వ తేదీన ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు వెల్లడిస్తారు. దీంతోపాటు ఉత్తరాఖండ్‌లోని కేదార్‌నాథ్ అసెంబ్లీ స్థానానికి, మహారాష్ట్రలోని నాందేడ్ లోక్ సభ స్థానానికి నవంబర్ 20న ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎన్నికల సంఘం ప్రకటించింది. 23న ఫలితాలు వెల్లడిస్తారు.

వయనాడ్ ఉప ఎన్నిక తేదీని ప్రకటించిన సీఈసీ

లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ రాజీనామా నేపథ్యంలో వయనాడ్ లోక్‌సభ ఉప ఎన్నిక షెడ్యుల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం (సీఈసీ) ప్రకటించింది. నవంబర్ 13వ తేదీన ఈ లోక్‌సభ నియోజకవర్గ ఉప ఎన్నికను నిర్వహించనున్నట్లు సీఈసీ వెల్లడించింది. మహారాష్ట్ర, జార?ండ్ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాజీవ్ కుమార్ మంగళవారం న్యూఢిల్లీలో ప్రకటించారు. అదే సమయంలో దేశంలోని వివిధ రాష్ట్రాల్లోని అసెంబ్లీ, లోక్‌సభ ఉప ఎన్నికల షెడ్యూల్‌ను సైతం ఆయన విడుదల చేశారు. ఆ క్రమంలో నవంబర్ 13వ తేదీన వయనాడ్ లోక్‌సభ ఉప ఎన్నిక నిర్వహించనున్నట్లు తెలిపారు.

వయనాడ్ లోక్‌సభ ఉప ఎన్నిక ఎందుకు జరుగుతుంది?

కేరళలోని వాయనాడ్ లోక్‌సభ స్థానం నుంచి రాహుల్ గాంధీ వరుసగా రెండు సార్లు గెలుపొందారు. అయితే గత లోక్‌సభ ఎన్నికల్లో అంటే.. 2019లో అమేఠీతోపాటు వయనాడ్ నుంచి రాహుల్ గాంధీ బరిలో దిగారు. కానీ ఆ ఎన్నికల్లో అమేఠీలో బీజేపీ ఎంపీ అభ్యర్థి స్మృతి ఇరానీ చేతిలో రాహుల్ ఓటమి పాలయ్యారు. ఇక వయనాడ్‌లో రాహుల్ విజయం సాధించారు. అలాగే 2024 లోక్‌సభ ఎన్నికల్లో వయనాడ్ నుంచి రాహుల్ గెలుపొందారు. ఇక రాయబరేలి నుంచి





సైతం ఆయన గెలుపొందారు. అయితే గెలిచిన కొద్ది రోజులకు ఈ రెండు నియోజకవర్గాల్లో ఏదో ఒక దానికి ఆయన రాజీనామా చేయాల్సి ఉంది. ఈ నేపథ్యంలో వయనాడ్ లోక్‌సభ స్థానానికి రాహుల్ గాంధీ రాజీనామా చేశారు. దీంతో ఈ స్థానానికి ఉప ఎన్నిక అనివార్యమైంది. ఇటువంటి పరిస్థితుల్లో కాంగ్రెస్ పార్టీ అగ్రనేత ప్రియాంక గాంధీ.. ఈ స్థానం నుంచి బరిలో దిగుతారనే ఓ ప్రచారం అయితే జోరుగా సాగుతుంది. ఎందుకంటే.. ఈ నియోజకవర్గ ప్రజలు వరుసగా రెండు సార్లు రాహుల్ గాంధీకి పట్టం కట్టారు. అలాగే ప్రియాంక గాంధీ సైతం పోటీ చేస్తే.. వయనాడ్ ప్రజలు ఆమెకు విజయం కట్టబెడతారనే ఓ ప్రచారం అయితే బలంగా సాగుతుంది. అదీకాక ఇటీవల భారీ వర్షాలు వరదలతో వయనాడ్ జిల్లాలోని పలు గ్రామాలు అతలాకుతలమైంది. భారీ నష్టం సైతం సంభవించింది. ఆ సమయంలో రాహుల్, ప్రియాంక గాంధీలు ఆయా గ్రామాల్లో సైతం పర్యటించారు. అలాగే ఆ గ్రామాల ప్రజలతో సైతం వారు నేరుగా సంభాషించారు. వయనాడ్‌లో సంభవించిన ప్రకృతి ప్రళయాన్ని జాతీయ విపత్తుగా పరిగణించాలంటూ కేంద్ర ప్రభుత్వానికి రాహుల్ గాంధీ పలుమార్లు విజ్ఞప్తి చేశారు. అయినా కేంద్రం మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించిన విషయం విధితమే. ఇక ప్రధాని మోదీ సైతం వయనాడ్‌లో పర్యటించిన సంగతి తెలిసిందే. కానీ వయనాడ్‌లో జరిగిన నష్టాన్ని మాత్రం ప్రకృతి విపత్తుగా కేంద్రం ప్రకటించకపోవడం గమనార్హం.

## ఐఏఎస్‌లకు చుక్కెదురు




తాము ప్రస్తుతం విధులు నిర్వర్తించే చోటే కొనసాగించేలా ఉత్తర్వులు ఇవ్వాలంటూ కేంద్ర పరిపాలన ట్రైబ్యునల్ (క్యాట్)ను ఆశ్రయించిన తెలంగాణ, ఏపీ ఐఏఎస్ అధికారులకు చుక్కెదురైంది. వారి పిటిషన్లపై మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చేందుకు క్యాట్ నిరాకరించింది. గతంలో ఏపీకి కేటాయించినా ఇంకా తెలంగాణలోనే విధులు నిర్వర్తిస్తున్న ఆమ్రపాలి, వాణీప్రసాద్, వాకాటి కరుణ... తెలంగాణకు కేటాయించినా ఏపీలో విధులు నిర్వర్తిస్తున్న సృజనను తమ సొంత క్యాడర్ రాష్ట్రాలకు వెళ్లాల్సిందిగా ఇటీవల డీవోపీటీ ఆదేశాలు ఇచ్చింది. అయితే, డీవోపీటీ ఆదేశాలను సవాల్ చేస్తూ పై నలుగురు ఐఏఎస్ లు క్యాట్ లో పిటిషన్లు దాఖలు చేశారు. డీవోపీటీ ఆదేశాలపై మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని క్యాట్ ను కోరారు. ఈ పిటిషన్లపై క్యాట్ నేడు విచారణ చేపట్టింది. ఐఏఎస్ అధికారుల తరఫున న్యాయవాదులు వాదనలు వినిపించారు. డీవోపీటీ ఉత్తర్వులు రద్దు చేయాలని కోరుతున్నామని వారు క్యాట్ కు విన్నవించారు. ఈ నెల 16న రిలీవ్ కావాలని డీవోపీటీ ఆదేశాలు ఇచ్చిందని, అయితే, హైకోర్టు ఆదేశాల మేరకు ఐఏఎస్ ల అభ్యర్థనను డీవోపీటీ పరిశీలించాలని న్యాయవాదులు కోరారు. డీవోపీటీ నేరుగా నిర్ణయం తీసుకోకుండా, ఏక సభ్య కమిటీని నియమించిందని, కానీ, ఐఏఎస్ ల కేటాయింపుపై నిర్ణయాధికారం డీవోపీటీకే ఉంటుందని వారు స్పష్టం చేశారు. అలాంటప్పుడు ఏక సభ్య కమిటీ సిఫారసును డీవోపీటీ ఎలా అమలు చేస్తుందని న్యాయవాదులు ప్రశ్నించారు. ఏక సభ్య కమిటీ డీవోపీటీకి ఇచ్చిన నివేదికను ఐఏఎస్ లకు ఇవ్వలేదని వారు క్యాట్ దృష్టికి తీసుకెళ్లారు. కమిటీ నివేదికను ఐఏఎస్ అధికారులకు ఇవ్వకుండానే డీవోపీటీ ఉత్తర్వులు ఇచ్చిందని ఆరోపించారు. ఈ వాదనలు విన్న క్యాట్ ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. వరదల కారణంగా ఏపీలో ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని, అలాంటప్పుడు ఏపీకి వెళ్లి వరద ప్రాంతాల్లో ప్రజలకు సేవ చేయాలని లేదా? అని సూటిగా ప్రశ్నించింది. డీవోపీటీ ఏక సభ్య కమిటీని నియమించినప్పుడే ఐఏఎస్ లు ఎందుకు స్పందించలేదని నిలదీసింది. ఎందుకు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేయలేదని క్యాట్ ప్రశ్నించింది. ఇలాంటి పరిస్థితుల్లో డీవోపీటీ ఆదేశాలపై మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేమని స్పష్టం చేసింది.

## ఎయిర్ ఇండియా విమానానికి బాంబు బెదిరింపు.. అయోధ్యలో అత్యవసర ల్యాండింగ్..!



ఎయిర్ ఇండియా విమానానికి బాంబు బెదిరింపు వచ్చింది. దాంతో విమానాన్ని అయోధ్య విమానాశ్రయంలో అత్యవసరంగా ల్యాండింగ్ చేశారు. ఈ సమయంలో విమానంలో 139 మంది ప్రయాణికులు ఉన్నారు. విమానం అత్యవసర ల్యాండింగ్ నేపథ్యంలో విమానాశ్రయంలో అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. ఎయిర్ ఇండియాకు చెందిన విమానం జైపూర్ నుంచి బయలుదేరగా.. అధికారుల ఆదేశాల మేరకు పైలట్లు విమానాన్ని అయోధ్యలోని మహర్షి వాల్మీకి విమానాశ్రయంలో సేఫ్‌గా ల్యాండ్ చేశారు. ఆ తర్వాత అధికారులు విమానంలో తనిఖీలు నిర్వహించారు. ఎలాంటి అనుమానాస్పద వస్తువులు కనిపించకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. సీనియర్ ఎస్పీ రాజ్‌కరణ్ నయ్యర్ ఆధ్వర్యంలో సోదాలు నిర్వహించారు. అనంతరం ఆయన అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ సందర్భంగా పరిస్థితిపై మీడియా ఆయనను ప్రశ్నించగా.. స్పందించేందుకు నిరాకరించారు. మరో వైపు ఏటీఎస్ సైతం విమానాశ్రయానికి చేరుకున్నది. అత్యవసర పరిస్థితుల్లో వైద్య సేవలు అందించేందుకు వచ్చానని, ప్రస్తుతానికి అలాంటి అవసరం లేదని ఓ అధికారి తెలిపారు. ప్రస్తుతం ఎస్ఎస్పీ, ఎస్పీ సిటీ సహా భద్రతా విభాగం అధికారులు దర్యాప్తు నిర్వహిస్తున్నారు. ఇదిలా ఉండగా.. గడిచిన 24గంటల్లో ఎయిర్ ఇండియా విమానానికి బాంబు బెదిరింపు రావడం ఇది రెండోసారి. ముంబయి నుంచి న్యూయార్క్‌కు బయలుదేరిన విమానానికి సైతం సోషల్ మీడియా వేదికగా బాంబు బెదిరింపు రావడంతో విమానాన్ని ఢిల్లీలో అత్యవసరంగా దింపారు. అంతకు ముందు సైతం ఇండోర్‌లోని దేవి అహల్యబాయ్ హెూల్కర్ విమానాశ్రయానికి సైతం బాంబు బెదిరింపులు వచ్చిన విషయం తెలిసిందే.

## మనదేశ డేటా మనవద్దే ఉండాలి: ఆకాశ్ అంబానీ



**న్యూఢిల్లీ:** స్వదేశీ కృత్రిమ మేధస్సు సామర్థ్యాన్ని అభివృద్ధి చేయాలని రిలయన్స్ జియో ఇన్‌ఫోకామ్ చైర్మెన్ ఆకాశ్ అంబానీ పిలుపునిచ్చారు. ఢిల్లీలోని భారత మండపంలో జరుగుతున్న ఇండియా మొబైల్ కాంగ్రెస్‌లో ఆయన మాట్లాడారు. స్వదేశీ ఏఐ సామర్థ్యం, అప్లికేషన్స్ పెంచేందుకు.. స్వదేశీ డేటా సెంటర్లను కూడా అభివృద్ధి చేయాలన్నారు. ఇక భారత్‌కు చెందిన డేటాను భారత్‌లోనే ఉంచాలని ఆయన అభిప్రాయపడ్డారు. దీని కోసం డేటా సెంటర్ పాలసీని ప్రభుత్వం తీసుకురావాలని ఆయన కోరారు. మానవ మెదడు సృష్టించిన విప్లవాత్మకమైన సాధనం ఏఐ అని, మన జీవితాన్ని, సమాజాన్ని, ఆర్థిక వ్యవస్థను ఆ టూల్ మార్చేస్తుందన్నారు. 2047 నాటి వరకు వికసిత్ భారత్ సృష్టించాలన్న కలను సాకరం చేయడంలో కీలక పాత్ర పోషించనున్నట్లు చెప్పారు.


## ఫైవ్ ఐస్ దేశాలతో సమాచారం పంచుకున్నాం

**వాషింగ్టన్:** సిక్కు తీవ్రవాది హర్దీప్ సింగ్ నిజ్జార్ హత్య కేసుపై కెనడా ప్రధాని జస్టిస్ ట్రూడో స్పందించారు. ఆ కేసుకు సంబంధించిన సమాచారాన్ని ఫైవ్ ఐస్ భాగస్వామ్య దేశాలతో పంచుకున్నట్లు ఆయన చెప్పారు. అమెరికాకు ఆ హత్య సమాచారాన్ని అందించినట్లు వెల్లడించారు. కెనడా జాతీయుడు నిజ్జార్ హత్య కేసులో భారతీయ దౌత్యవేత్తల పాత్ర ఉన్నట్లు ట్రూడో ఆరోపిస్తున్నారు. దానికి సంబంధించిన సమాచారాన్ని ఫైవ్ ఐస్ దేశాలకు చేరవేసినట్లు ఆయన చెప్పారు. సోమవారం ఆరుగురు కెనడా దౌత్యవేత్తలను భారత్ బహిష్కరించింది. ఇక కెనడాలో ఉన్న హై కమీషనర్లను కూడా వెనక్కి రప్పిస్తున్నట్లు భారత్ పేర్కొన్నది. ఈ నేపథ్యంలో కెనడా ప్రధాని ట్రూడో అత్యవసర సమావేశాన్ని నిర్వహించారు. గత ఏడాది సమ్మర్ నుంచి నిజ్జార్ హత్య కేసులో ఫైవ్ ఐస్ దేశాలతో చర్చించామని, ముఖ్యంగా అమెరికాతో ఈ విషయాన్ని పంచుకున్నామని, భారత్ సాగిస్తున్న హత్యాకాండ గురించి సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకున్నట్లు ట్రూడో వెల్లడించారు. కూటమి దేశాలతో ఈ అంశంపై పనిచేయనున్నట్లు ఆయన చెప్పారు.

# కలిసి పని చేస్తాం..

-మొదటిపేజీ తరువాయి

ఈ అంశంలోనూ బీఆర్ఎస్ నేతలు అవే అబద్దాలు చెబుతున్నారని విమర్శించారు. వికారాబాద్ పూడూర్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రసంగించారు. దేశ రక్షణలో తెలంగాణ రాష్ట్రం మరో కీలక అడుగు ముందుకు వేయబోతోంది. దేశ రక్షణకు సంబంధించి కీలకమైన డిఫెన్స్,ఎన్.ఎఫ్.సీ లాంటి కేంద్రాలకు హైదరాబాద్ గుర్తింపు పొందింది. కొందరు వీఎల్ఎఫ్ ను వివాదం చేసే ప్రయత్నం చేస్తున్నారు. వీఎల్ఎఫ్ తో ప్రజలకు అన్యాయం జరుగుతుందని అపోహలు కలిగించే ప్రయత్నం చేస్తున్నారు. తమిళనాడు లోనూ 1990లో ఇలాంటిదే ప్రారంభించారు. అక్కడి ప్రజలకు ఎలాంటి నష్టం జరగలేదు. దేశంలో రెండో వీఎల్ఎఫ్ మన ప్రాంతంలో రావడం గర్వకారణం. ఈ ప్రాజెక్టు ప్రాధాన్యతను తెలంగాణ సమాజం గుర్తించాలి. వివాదాలకు తెరలేపుతున్నవారు దేశ రక్షణ గురించి ఆలోచన చేయాలి. దేశం ఉంటేనే మనం ఉంటాం.. మనం ఉంటేనే మన ప్రాంతం అభివృద్ధి చెందుతుంది. దేశ రక్షణ కోసం ఏర్పాటు చేసే ప్రాజెక్టులను కూడా రాజకీయాల మోసం వివాదం చేసేవారికి కనువిప్పు కలగాలి. 2 017లోనే భూ బదలాయింపు, నిధుల కేటాయింపు లాంటి పూర్తి నిర్ణయాలన్నీ గత ప్రభుత్వ హయాంలోనే జరిగాయి. ప్రాజెక్టును ప్రారంభించాలని రాజ్ నాథ్ సింగ్ అడగగానే మేం కొనసాగించాం దేశ రక్షణ విషయంలో రాజీ పడొద్దనే పనులు ప్రారంభించాలని అధికారులను ఆదేశించా. పర్యావరణ ప్రేమికులకు నేను ఒకటే చెబుతున్నా. దేశం, దేశ ప్రజలు సురక్షితంగా ఉంటేనే పర్యావరణ రక్షణ గురించి ఆలోచించగలం. దేశ భద్రతకు సంబంధించిన ప్రాజెక్ట్ ను వివాదాస్పదం చేయడం సమంజసం కాదు. ఎన్నికలప్పుడు మాత్రమే పార్టీలు, రాజకీయాలు... దేశ రక్షణ విషయంలో కలిసికట్టుగా ముందుకెళ్లాలి. వీఎల్ఎఫ్ ను ముందుకు తీసుకెళ్లేందుకు మా ప్రభుత్వం పూర్తి మద్దతుగా ఉంటుందని అన్నారు. ఇక్కడ ఉన్న రామలింగేశ్వర స్వామి ఆలయానికి వచ్చేవారిని అనుమతించాలని కేంద్ర మంత్రి రాజ్ నాథ్ సింగ్ కి విజ్ఞప్తి చేస్తున్నా.ఆలయానికి ఇబ్బందులు కలిగించొద్దని కోరుతున్నా. ప్రజల సెంటిమెంట్, విశ్వాసాన్ని గౌరవించి



ఆలయానికి వెళ్లేందుకు దారి ఇవ్వాలని కోరుతున్నా. ఈ ప్రాంతంలో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసే విద్యా సంస్థల్లో ఈ ప్రాంత ప్రజలకు 1/3వ వంతు సీట్లు కేటాయించాలని కోరుతున్నానని అన్నారు.

**దేశ భద్రత విషయంలో రాజకీయాలు తగవు**

దేశ భద్రత విషయంలో రాజకీయాలు చేయడం సరికాదని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్. వికారాబాద్ జిల్లా దామగుండం వద్ద రాడార్ కేంద్రానికి ఆయన మంగళవారం శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో రాజ్ నాథ్ మాట్లాడుతూ.. రాడార్ కేంద్రం ఏర్పాటుకు సహకరించిన రాష్ట్ర సర్కారుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ ప్రాజెక్ట్ నిర్మాణానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన కృషి అభినందనీయం అని కొనియాడారు. "అబ్దుల్ కలాం జయంతి నాడు ఈ రాడార్ ప్రాజెక్ట్ శంకుస్థాపన జరగడం హర్షించదగ్గ విషయం. రక్షణ రంగ పరికరాల తయారీలో హైదరాబాద్‌కు మంచి పేరు ఉంది. దేశ భద్రతలో రాడార్ స్టేషన్ కీలకం. కమ్యూనికేషన్ రంగంలో టెక్నాలజీ ఎప్పటికప్పుడు మారుతూ వస్తోంది. రాజకీయాలు వేరు.. దేశ భద్రత వేరు. తపాలా వ్యవస్థ అనేక ఏళ్లు ఉపయోగపడింది. ప్రస్తుతం ఇంట్లో కూర్చునే అనేక కోర్సులు నేర్చుకునే అవకాశం వచ్చింది. దేశ భద్రత విషయంలో రాజకీయాలు చేయడం తగదు" అని రాజ్ నాథ్ మరోసారి ఉద్ఘాటించారు. దేశం యొక్క బలమైన మరియు భద్రత కోసం ఈ రకమైన స్టేషన్లు మన దేశానికి అత్యంత ముఖ్యమైనవి. పూర్వం కమ్యూనికేషన్ మరియు సమాచారం కోసం ఈగల్ మరియు ఇతర పక్షులను ఉపయోగించాము. ఇతర కమ్యూనికేషన్లను వ్యవస్థను బలోపేతం చేస్తు ఉపయోగిస్తున్నాము. కమ్యూనికేషన్ వ్యవస్థను వేగంగా అభివృద్ధి చేస్తున్నాము. గత ముప్పై సంవత్సరాల నుండి మన దేశం కమ్యూనికేషన్ వ్యవస్థను అభివృద్ధి చేస్తోంది. దేశం బలమైన మిలిటరీని నిర్మించడానికి కట్టుబడి ఉందని అన్నారు. కొందరు వ్యక్తులు ఈ ప్రాజెక్ట్ గురించి తప్పుడు సమాచారాన్ని సృష్టిస్తున్నారు. మరియు పర్యావరణానికి నష్టం జరిగిందని అంటున్నారు. ఈ ప్రాజెక్ట్ పర్యావరణానికి హాని కలిగించదని చెబుతున్నాను. కొంతమందికి తప్పుడు సమాచారం ఇస్తున్నారు. దేశ రక్షణ భద్రత విషయంలో కేంద్రం మరింత కట్టుబడి పనిచేస్తుందని అన్నారు.

# ఇందిరమ్మ రాజ్యమని దళారుల రాజ్యం తెచ్చారు

-మొదటిపేజీ తరువాయి

చెల్లించకుండా పేద విద్యార్థులను చదువుకు దూరం చేస్తున్నారని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.
మూసీ కోసం రూ. లక్షా 50 వేల కోట్లు ఖర్చు చేసే కాంగ్రెస్ సర్కార్ దగ్గర అద్దె, ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు ఇవ్వటానికి పైసలు లేవా? రాష్ట్రానికి విద్యా శాఖ మంత్రి లేదు, ముఖ్యమంత్రికి విద్యారంగంలో సమస్యలను తెలుసుకునే ఓపిక లేదు. రాష్ట్రంలో విద్యార్థులు నష్టపోకుండా చర్యలు తీసుకోవాల్సిందిపోయి.. ఎంతసేపు ఢిల్లీకి మూటలు పంపించే పనిలోనే ముఖ్యమంత్రి బిజీగా ఉన్నాడు. లక్షలాది మంది విద్యార్థుల జీవితాలతో రేవంత్ రెడ్డి సర్కార్ చెలగాట మాడుతోంది. ఢిల్లీకి మూటలు పంపించటంపై ఉన్న శ్రద్ధ.. విద్యార్థులకు మేలు చేయటంలో లేదా? కాలేజీలు నిరవధికంగా బంద్ చేస్తామని హెచ్చరించినా, సర్కారుకు చీమ కుట్టినట్టైనా లేదా? వెంటనే రీయింబర్స్‌మెంట్ బకాయిలు, స్కాలర్‌షిప్‌లు చెల్లించాలి. విద్యార్థులకు అన్యాయం చేస్తామంటే బీఆర్ఎస్ సహించదు అని కేటీఆర్ తేల్చిచెప్పారు.

**ఇందిరమ్మ రాజ్యమని దళారుల రాజ్యం తెచ్చారు: కేటీఆర్..**

తెలంగాణలో కాంగ్రెస్ అధికారం చేపట్టిన నాటి నుంచి అన్నీ రంగాలు కుదేలయ్యాయని బీఆర్ఎస్ మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్ రావు అన్నారు. వ్యవసాయ, విద్యా, విద్యుత్ రంగాలు అధ్వానంగా మారాయని బీర్ఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. గురుకులాల బిల్డింగులకు కనీసం అద్దె చెల్లించలేక విద్యార్థులను రోడ్డుపైకి తెచ్చారని హరీశ్ రావు ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా ఇద్దరు నేతలూ ట్విటర్ వేదికగా సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వంపై



విమర్శలు గుప్పించారు.

**కేటీఆర్ ట్వీట్ ఇదే..**

"బడా భాయ్ (ప్రధాని మోదీ) రాష్ట్రంలో పత్తి రైతులకు పట్టాభిషేకం జరుగుతుంటే చోటా భాయ్ (రేవంత్ రెడ్డి) పాలనలో మాత్రం పత్తి రైతులు చిత్తు అయ్యారు. గుజరాత్‌లో మద్దతు ధరకు మించి క్వింటా పత్తి ధర రూ.8,257 పలుకుతోంది. కానీ తెలంగాణలో క్వింటా ధర కేవలం రూ.5వేలేనా?. రెండేళ్ల కిందట పత్తి క్వింటా ధర 10 నుంచి 15 వేల వరకూ పలికింది. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే పరిస్థితి మారింది. మార్కెట్‌కు దిగుబడి వచ్చినా సీసీఐ కేంద్రాలెక్కడ?. ఇందిరమ్మ రాజ్యమని దళారుల రాజ్యం తెస్తారా?. నిన్న పెట్టుబడి సాయం అందించలేదు, నేడు కష్టించి పండించినా పంట కొనుగోలు చేయరా?. పత్తి రైతుల జీవితాలతో కాంగ్రెస్ సర్కార్ చెలగాటం ఆడుతోంది. ముందుచూపు లేని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వల్లే పత్తి రైతులకు రాష్ట్రంలో అన్యాయం జరుగుతోంది.

**బాదుడే బాదుడు..**

కరెంట్ కోతల కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇప్పుడు వాతలు పెట్టేందుకు రెడీ అవుతోంది. విద్యుత్ సరఫరాకు గ్యారెంటీ లేదు కానీ విద్యుత్ షాకులకు మాత్రం గ్యారెంటీ ఇస్తోంది. పవర్‌లోకి వచ్చి ఏడాది కాకముందే పవర్ ఛార్జీలు పెంచి జనం మీద భారం మోపడానికి సిద్ధమయ్యారు. ఉచిత కరెంట్ ఇస్తామని చెప్పి దాన్ని అటకెక్కించారు. గృహజ్యోతి పథకం ఇంకా గ్రహణంలోనే ఉంది. జీరో బిల్లుల కోసం ఎదురు చూస్తుంటే గుండె గుబేలు మనేలా కొత్త బాదుడు షురూ చేస్తారా?. ఒక్క గ్యారెంటీ అయినా సరిగా అమలు చేసింది లేదు. 420 హామీలకు అతీగతీ లేదు. రాష్ట్ర ఖజానా ఖాళీ చేసి ఏం చేస్తున్నారు.?. 9 నెలల్లో ఎడాపెడా అప్పులు చేసి తెచ్చిన రూ.77వేల కోట్లు ఎటుపోయాయి?. అవి సరిపోక మళ్లీ ప్రజల నడ్డి విరిగే వడ్డనలు ఎందుకు?. అసమర్థుల పాలనలో ఆఖరికి మిగిలేది కోతలూ వాతలే" అని అన్నారు.

**అద్దెలు చెల్లించలేరా?**

"10 నెలలుగా అద్దె చెల్లించకపోవడంతో జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో గురుకులాల పరిస్థితి అధ్వానంగా మారింది. అద్దె రాకపోవడంతో ఓ మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్ భవన యజమాన్ని పాఠశాలకు తాళం వేశారు. కాంగ్రెస్ పాలనలో గురుకులాల నిర్వహణ అధ్వాన స్థితికి చేరుకుందని చెప్పడానికే ఇది మరో నిదర్శనం. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు.. గురుకులాలకు అద్దెలు ఇంకెప్పుడు చెల్లిస్తారు?. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో విద్యావ్యవస్థ రోజురోజుకీ దిగజారిపోతోంది. దీనిపై విద్యా శాఖ మంత్రిగా ఉన్న మీరు ఇంకెప్పుడు పట్టించుకుంటారు?" అని హరీశ్ రావు ట్వీట్ చేశారు.

# మళ్లీ ఢిల్లీకి రేవంత్

**హైదరాబాద్ :** సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం ఢిల్లీ బాటపట్టనున్నారు. ఈ మేరకు ఏఐసీసీ పెద్దలతో కీలక చర్చలు జరిగే అవకాశమున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే క్యాబినెట్ విస్తరణపై పార్టీ అగ్రనేతలతో భేటీ కానున్నట్లు సమాచారం. మరోవైపు గురువారం ఢిల్లీలో అత్యంత కీలకమైన సీడబ్ల్యూసీ సమావేశం నిర్వహిస్తున్నారు. తెలంగాణ నుంచి కేవలం ఇద్దరు మాత్రమే ఈ భేటీలో పాల్గొననున్నట్లు పార్టీ వర్గాలు అంటున్నాయి. సీఎం రేవంత్ రెడ్డితో పాటు కాంగ్రెస్ ప్రెసిడెంట్ మహేశ్ కుమార్ గౌడ్ సైతం ఢిల్లీ వెళుతున్నారట. దీంతో మంత్రి పదవిపై గంపెడు ఆశలు పెట్టుకున్న ఎమ్మెల్యేలు రేపటి సమావేశంపై ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారట. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి దాదాపుగా 10 నెలలు గడిచిపోతోంది. అయితే చాలా కాలంగా వాయిదా పడుతూ వస్తున్న మంత్రివర్గ విస్తరణ అంశాన్ని ఈసారి సాధించుకువస్తారని తెలుస్తోంది. గత డిసెంబర్ లో ప్రజా ప్రభుత్వం ఏర్పడింది. అయితే అప్పట్నుంచి నేటివరకు పూర్తి స్థాయిలో మంత్రివర్గ విస్తరణ పలుమార్లు వాయిదా పడుతూ వస్తోంది. ఈ విషయంపై ఢిల్లీలోని అధిష్ఠానంతో మాట్లాడేందుకు రేవంత్‌రెడ్డి ఇప్పటికే చాలాసార్లు హస్తినలో పర్యటించారు. మరోవైపు రాష్ట్రానికి సంబంధించిన కీలక విషయాలపై హైకమాండ్‌తో చర్చించనున్నట్లు గాంధీభవన్ వర్గాలు భావిస్తున్నాయి. తాజాగా హర్యానా, జమ్మూకశ్మీర్ ఎన్నికలకు ముందే తెలంగాణ క్యాబినెట్‌ను విస్తరించాలని పార్టీ పెద్దలు ఆశించారు. కానీ ఆ? రాష్ట్రాల్లో ఎన్నికలపైనే కాంగ్రెస్ అగ్రనేతలు దృష్టి కేంద్రీకరించడంతో క్యాబినెట్ విస్తరణ సాధ్యం కాలేదు. దీంతో రేపటి కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సమావేశానికి రేవంత్‌రెడ్డి హాజరవుతున్నారు. అనంతరం ప్రత్యేకంగా సోనియా, రాహుల్, ఖర్గేలతో సమావేశమై క్యాబినెట్ విస్తరణపై చర్చించనున్నారట. ఫలితంగా కొత్త మంత్రుల జాబితాతోనే తెలంగాణకు తిరిగు



పయనమవుతారని పార్టీ వర్గాలు వెల్లడించాయి.

## సీతక్క, ఉత్తమ్‌లకు కీలక బాధ్యతలు



-మొదటిపేజీ తరువాయి

నియమించారు. కేంద్ర ఎన్నికల సంఘం రెండు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు ఇవాళ షెడ్యూల్ వెలువరించనున్న నేపథ్యంలో ఏఐసీసీ పరిశీలకులను నియామకం జరిగింది.
తెలంగాణకు చెందిన ఇరువురు మంత్రులకు ఢిల్లీ కాంగ్రెస్ పెద్దలు అతిపెద్ద బాధ్యతను అప్పగించారు. మహారాష్ట్ర, ఝార్ఖండ్ రాష్ట్రాలలో ఇక ఎన్నికల సందడి నెలకొననున్న నేపథ్యంలో.. కాంగ్రెస్ అధిష్టానం కీలక నిర్ణయం తీసుకుంది. మహారాష్ట్రలో 288 అసెంబ్లీ స్థానాలకు, జార్ఖండ్ 81 స్థానాలకు ఎన్నికలు నిర్వహించేందుకు ఇక కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటనే తరువాయి.అందుకు ముందుగానే ప్రధాన పార్టీలు ఎన్నికలకు సిద్ధమవుతున్నాయి. ఇటీవల జరిగిన జమ్మూ కాశ్మీర్, హర్యానా ఎన్నికలలో జమ్ము కాశ్మీర్ ను కాంగ్రెస్ కూటమి వశం చేసుకోగా.. హర్యానాను బిజెపి దక్కించుకుంది. ఈ రెండు రాష్ట్రాలలో పోటాపోటీగా ప్రచారం సాగించి, ఎన్నికలకు వెళ్లిన కాంగ్రెస్, బిజెపిలకు చెరో ఒక రాష్ట్రం దక్కింది. ఇక తాజాగా మహారాష్ట్ర, ఝార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ విడుదల కానుండగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ పరిశీలకులను నియమించింది.ఈ మేరకు ఏఐసిసి ప్రకటన జారీ చేయగా.. తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ నుండి ఇరువురు మంత్రులపై సరికొత్త బాధ్యతను కాంగ్రెస్ పెద్దలు ఉంచారు. వారిలో రాష్ట్ర మంత్రులు సీతక్క, ఉత్తమ్ కుమార్ రెడ్డి ఉండగా.. వీరు మహారాష్ట్ర పార్టీ సీనియర్ పరిశీలకులుగా వ్యవహరించనున్నారు. నార్త్ మహారాష్ట్ర కు సీతక్క, మరత్వాడ కు ఉత్తమ్ కుమార్ రెడ్డిలు పార్టీ స్థితిగతులను పరిశీలిస్తూ వాటిని చక్కదిద్దుతారు.అంతేకాకుండా మహారాష్ట్ర, ఝార్ఖండ్ రాష్ట్రాలలో ఎన్నికల నిర్వహణకు ఈసీ గ్రీన్ సిగ్నల్ ఇవ్వగానే.. ఇక నామినేషన్ ల పర్వం, ప్రచారాల మోతలు ఇక్కడ మ్రోగనున్నాయి. కాగా మహారాష్ట్రకు సంబంధించి ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ ఇటీవల కీలక వ్యాఖ్యలు చేశారు. మహారాష్ట్రలో కాంగ్రెస్ అధికారం చేజిక్కించుకొనేందుకు ఎట్టి పరిస్థితుల్లో అన్ని పార్టీలతో కలవాలన్నారు.అందుకు తాను కూడా సహకరిస్తానని, అయితే చర్చలు జరగాలని సూచించారు. హైదరాబాద్ ఎంపీగా గల అసదుద్దీన్ ఓవైసీ చేసిన ఈ వ్యాఖ్యలు పొలిటికల్ హీట్ పెంచాయని చెప్పవచ్చు. అలాగే అక్కడ బీజేపీ ఓటమి కోసం తాను కాంగ్రెస్ కు సహకరిస్తానంటూ ప్రకటన ఇచ్చారు. కాంగ్రెస్ మద్దతు ఇవ్వకుంటే మాత్రం.. ఎంఐఎం దారి వేరుగా ఉంటుందని అసదుద్దీన్ చెప్పారు.ఈ ప్రకటన ఓవైసీ చేసిన కొద్దిరోజులకు కాంగ్రెస్ పార్టీ పరిశీలకులను నియమించడం, అందులో తెలంగాణకు చెందిన ఇరువురు మంత్రులకు చోటు దక్కడం విశేషం. మరి ఓవైసీ సహకారాన్ని మహారాష్ట్రలో కాంగ్రెస్ తీసుకుంటుందా.. లేదా అనేది తేలాల్సి ఉంది. కాంగ్రెస్ అధిష్టానం ఎంఐఎం మద్దతు కోరుకుంటే మాత్రం.. దౌత్యానికి తెలంగాణ మంత్రులను ఉపయోగించే అవకాశం ఉన్నట్లు రాజకీయ విశ్లేషకుల అంచనా.

## ప్రజల ఆశయాలకు అనుగుణంగా ప్రభుత్వం పనిచేస్తుంది

-మొదటిపేజీ తరువాయి

ఉచిత సౌకర్యాలు కల్పించాం. 2 లక్షల రూపాయల రుణ మాఫీ, 500 రూపాయలకు గ్యాస్, 200 యూనిట్ల కరెంట్, స్కిల్ యూనివర్సిటీ, అనేక కొత్త విధానాలు అమలు చేస్తున్నామన్నారు.మీరంతా ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి విరివిగా తీస్కెళ్లాలని పిలుపు నిచ్చారు.ప్రజల మద్దతు ప్రభుత్వానికి సంపూర్ణాంగ ఉండేలా కృషి చేయాలి..క్షేత్ర స్థాయి లో మరింత లోతుగా పని చేయాలి. రాబోయే ఎన్నిలకలో మనం మరింత గట్టిగా పని చేయాలి.స్థానిక సంస్థల ఎన్నికలు, ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలన్నారు...నియోజకవర్గ నాయకులు కలిసికట్టుగా పని చేయాలి టీపీసీసీ అధ్యక్షులుగా నాకు ఒక పెద్ద బాధ్యత ఇచ్చారు.. నియోజక వర్గ ఇంచార్జ్ లు మంచిగా కలుపుకొని పోవాలి మెదక్ పూర్వ జిల్లాలో మనం మరింత గట్టిగా కృషి చేయాలి నియోజక వర్గ ఇంచార్జ్ భేషజాలకు పోకుండా కలిసికట్టుగా పని చేసి మంచి ఫలితాలు తేవాలి.రాబోయే ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధించాలి.. క్రమశిక్షణ అనేది చాలా కీలకం.. క్రమశిక్షణ ఉల్లంగిస్తే ఊరుకునేది లేదు మెదక్ జిల్లా లో మంచి ఫలితాలు సాధించే దిశగా పని చేయాలి.

## గ్రూప్ 1 మెయిన్స్ పరీక్షకు లైన్ క్లియర్



-మొదటిపేజీ తరువాయి

గ్రూప్ 1 ప్రిలిమ్స్ పరీక్షలపై దాఖలైన రెండు పిటిషన్లను హైకోర్టు కొట్టివేసింది. గ్రూప్ 1లో తప్పుడు ప్రశ్నలను తొలగించాలని ఒక పిటిషన్ దాఖలవగా.. ప్రిలిమీనరీ కీ లో తప్పులు ఉన్నాయని, కీ ని రీ నోటిఫికేషన్ చేయాలని మరో పిటిషన్‌ను అభ్యర్థులు దాఖలు చేశారు. తప్పుడు ప్రశ్నలు తొలగించి మళ్లీ మెరిట్ జాబితాను విడుదల చేయాలని పిటిషనర్లు కోరారు. ఈ పిటిషన్లపై ఈరోజు హైకోర్టులో విచారణ జరిగింది. త్వరలో గ్రూప్ వన్ మెయిన్స్ పరీక్షలు జరగబోతున్నాయని ఈ సమయంలో న్యాయస్థానం జోక్యం చేసుకుంటే మెయిన్స్ విద్యార్థులు నష్టపోతారని టీజీపీఎస్సీ కోర్టుకు తెలియజేసింది. ప్రభుత్వ వాదనలతో ఏకీభవించిన హైకోర్టు పిటిషన్‌లను కొట్టివేసింది. దీంతో ఈనెల 21 నుంచి గ్రూప్ -1 మెయిన్స్ పరీక్షలు యథావిధిగా జరుగనున్నాయి.

**అందుబాటులోకి హాల్ టికెట్లు...**

మరోవైపు గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలకు సంబంధించిన హాల్ టికెట్లు అందుబాటులోకి వచ్చాయి. తెలంగాణ పబ్లిక్ సర్వీసు కమిషన్ వెబ్‌సైట్ నుంచి అభ్యర్థులు ఈ హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఈ నెల 21 నుంచి 27వరకు గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు జరగనున్న విషయం తెలిసిందే. ప్రిలిమినరీ పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులు మెయిన్స్ పరీక్షలు రాయనున్నారు. ఈ పరీక్షలను హెచ్ఎండీఏ పరిధిలో నిర్వహిస్తున్నారు. హాల్‌టికెట్లు పరీక్ష ప్రారంభమయ్యే ఒక రోజు ముందు వరకు అందుబాటులో ఉంటాయని అధికారులు వెల్లడించారు. మెయిన్స్ పరీక్షలు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరగనున్నాయి. అభ్యర్థులు పరీక్ష ప్రారంభానికి కనీసం 30 నిమిషాల ముందుగా పరీక్ష హాల్‌లోకి చేరుకోవాల్సి ఉంటుంది. మధ్యాహ్నం 12.30 గంటల నుంచి 1.30 గంటల వరకు అభ్యర్థులను అనుమతించనున్నట్టు అధికారులు వెల్లడించారు. ఆ తర్వాత వచ్చే వారిని అనుమతించబోమని స్పష్టంచేశారు. మెయిన్స్‌లో భాగంగా ప్రతి అభ్యర్థి ఆరు పేపర్లకు సంబంధించి పరీక్షలు రాయాల్సి ఉంటుంది.

## సంపాదకీయం

# అనస్థీషియా ఆవిష్కరణ

ప్రపంచ అనస్థీషియా దినోత్సవం ప్రతి సంవత్సరం అక్టోబరు 16న నిర్వహించబడుతుంది. తొలిసారిగా అనస్థీషియా (మత్తుమందు) ఇచ్చి శస్త్రచికిత్స చేసిన రోజుకు గుర్తుగా ఈ దినోత్సవాన్ని జరుపు కుంటారు. ప్రపంచ అనస్థీషి యాలజిస్టుల సంఘం ద్వారా ప్రపంచ అనస్థీషియా దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం అక్టోబర్16 న జరుపుకోవడం ఆనవాయితీగా వస్తున్నది. వరల్డ్ ఫెడరేషన్ ఆఫ్ సొసైటీస్ ఆఫ్ అనస్థీషియాల జిస్టుల ద్వారా ప్రతి సంవత్సరం ప్రపంచ అనస్థీషియా దినోత్సవాన్ని జరుపుకునే క్రమంలో 150 కంటే ఎక్కువ దేశాల నుండి అనస్థీషియా లజిస్టులకు ప్రాతినిధ్యం వహిస్తున్న 134 కంటే ఎక్కువ సంఘాలు పాల్గొంటాయి. పూర్వకాలంలో శస్త్ర చికిత్స అనంతరం పుట్టే నొప్పిని తగ్గించేదిగా ఆల్కహాల్ (మదిర) ను గుర్తించి శస్త్ర చికిత్స చేయించుకునే రోగికి ...6వ శతాబ్దానికి చెందిన ఆయుర్వేదానికి చెందిన శస్త్ర చికిత్సకుడు, అపర ధన్వంతరి సుశ్రుతుడు సురాపానం చేయించే వాడు. భరించలేని చాలా నొప్పికి ఉప శమనంగా వైద్యులు, నర్సులు కాకుండా ఇతర మనుషులు గట్టిగా పట్టుకుంటే శస్త్ర చికిత్స చేసేవారు.అమెరికాలోని మసెచ్యూసెట్ ఆసుపత్రిలో 1846 అక్టోబర్ 16వ తేదీన విలియమ్స్ థామస్ గ్రీన్ మార్టన్ అనే వైద్యుడు గిల్బర్ట్ అబోట్ అనే రోగిపై ఈథర్ వాయువును ప్రయోగించారు.అమెరికాలోని న్యూయార్క్ నగరంలో మసాచుసెట్స్ ప్రభుత్వ ఆసుపత్రిలో 1846 అక్టోబర్ 16న గిల్బర్ట్ అంబార్టు గొంతుకు శస్త్రచికిత్స చేసేందుకు... విలియమ్స్ థామస్ గ్రీన్ మార్టన్ అనే వైద్యుడు ప్రముఖ దంత వైద్యుడు జాన్‌కొలిన్స్‌తో కలిసి ఈథర్ మత్తు మందు ఇవ్వగా, హార్వర్డ్ మెడికల్ స్కూల్ మొదటి డీన్ అయిన జాన్ కాలిన్స్ వారెన్, అబాట్ మెడలోని కణితి భాగాన్ని నొప్పిలేకుండా తొలగించగా, అలా దిగ్విజయంగా ఆపరేషన్ చేశారు. ఈథర్. సల్ఫూరిక్ యాసిడ్, ఆల్కహాల్ మిశ్రమాన్ని సంశ్లేషణను ఇందుకు ఉపయోగించారు.1860ల నాటికి మత్తు మందు విస్తృతంగా వాడకంలోకి వచ్చింది. 1860ల్లో యాంటీ సెప్టిక్ పద్ధతుల కనిపెట్టిన తర్వాత ఆపరేషన్లు మరింత సులువుగా మారాయి. ఈ పరిణామం వైద్యశాస్త్రంలో అద్భుతం ఆవిష్కరించడమే గాకుండా మత్తు వైద్య విభాగంలో విప్లవాత్మ కమైన మార్పులకు నాంది పలికింది. ఇది వైద్య చరిత్రలోని అత్యంత ముఖ్యమైన సంఘటనలలో ఒకటిగా నిలిచి పోయింది. ఆ విజయాన్ని పురస్కరించుకుని అప్పటి నుంచి ఏటా అదే రోజున ప్రపంచ అనస్తీషియా దినోత్సవంగా నిర్వహిస్తున్నారు. సాధారణ మత్తు (అనస్థీషియా) ను నియంత్రితంగా స్పృహను కోల్పోయేలా చెయ్యడానికి ఉపయోగిస్తారు, దీనిని శస్త్రచికిత్సలు నిర్వహించవలసిన అవసరం ఉన్నపుడు ఉపయోగిస్తారు. అనస్థీషియా వైద్య ప్రయోజనాల కోసం ఇవ్వబడేది, ఇది తాత్కా లికంగా స్పర్శను అలాగే స్పృహను కోల్పోయేలా చేస్తుంది. ఆపరేషన్ సమయంలో అనస్థీషియా ఉపయోగించడం వల్ల రోగి నిద్రాణ స్థితిలో ఉంటాడు. నరాల ద్వారా సంకేతాలు బదిలీకావడాన్ని అనస్తీటిక్స్ నిరోధిస్తాయి, తద్వారా మెదడు నొప్పిని గుర్తించే అనుభూతిని నిరోధిస్తాయి. ఆపరేషన్ సమయం, శరీర భాగం, వైద్య పరిస్థితి, రోగి వయస్సు తదితరాలను బట్టి మత్తు ఇచ్చే విధానాన్ని ఎంపిక చేసుకుంటారు. సాధారణ అనస్థీషియాలో... రోగులు అపస్మారక స్థితిలో ఉంటారు, ఏమీ అనుభూతి చెందరు. స్థానిక అనస్థీషి యాలో... రోగి శస్త్రచికిత్స సమయంలో మెలకువగా ఉంటాడు, నిర్ణీత ప్రాంతాన్ని తిమ్మిరి చేయడానికి మందులు ఇంజెక్ట్ చేయ బడతాయి. ప్రాంతీయ అనస్థీషియాలో... రోగులు మేల్కొని ఉంటారు. శరీర భాగాలు తిమ్మిరిగా ఉంటాయి. మానిటర్డ్ అనస్థీషియా కేర్ అనేది స్థానిక అనస్థీషియాతో పాటు మత్తు, అనల్జీసియాతో పాటుగా డయాగ్నస్టిక్ లేదా థెరప్యూటిక్ విధానాల కోసం సురక్షితమైన విధానంగా మత్తు, రోగి యొక్క ఆందోళనను తగ్గించే చర్యలు, సమర్థవంత మైన నొప్పి నియంత్రణకు ఉపకరిస్తుంది. బాయల్స్ అనే అనస్థీషియా మిషన్ కనిపెట్ట బడ్డాక, ఈ మిషన్ అనస్థీషియా విభాగంలో విప్లవాత్మకమైన మార్పులను తీసుకు వచ్చింది. దీని ద్వారా ఏకకాలంలో ఒకటి కంటే ఎక్కువ అనస్థీషియా వాయువులను నిర్ధిష్టమైన ప్రమాణంలో రోగి శరీరంలోకి పంపించడానికి అవకాశం ఉంటుంది. మత్తుమందు డాక్టర్లు ఉపయోగించే అనేక పరికరాలు రోగి పల్స్, బీపీ, ఆక్సిజన్ స్థాయిలు, కార్బన్‌డైయాక్సైడ్లలను నిరంతరం పర్యవేక్షించడానికి సాయం చేస్తున్నాయి. రోగులకు ఆపరేషన్లు నిర్వహించడంలో అనస్థీషియా వైద్యులే కీలక పాత్ర పోషిస్తారు. చిన్న శస్త్ర చికిత్సలు మొదలు కొని అతి క్లిష్టమైన మెదడు, గుండె, ఊపిరి తిత్తులు, కాలేయం, మూత్ర పిండాలు, అవయవాల మార్పిడి, కీళ్ల మార్పిడిని సునాయసంగా చేస్తున్నారు. అంటే ఐసీయూ, ప్రకృతి వైపరీత్యాలు, దీర్ఘకాలిక నొప్పుల నివారణలోనూ అనస్థీషియా వైద్యులు కీలక పాత్ర పోషిస్తున్నారు. రోగులకు శస్త్ర చికిత్సకు ముందు సంరక్షణకు అనస్థీటిస్టులు బాధ్యత వహిస్తారు. ఆపరేషన్ థియేటర్లలో రోగికి మత్తు ఇవ్వడమే గాక అత్యవసర విభాగాల్లో వెంటిలేటర్ ద్వారా కృత్రిమ శ్వాస అందించడం, ఆఖరి క్షణాల్లో రోగులకు శ్వాస, రక్త ప్రసరణ పునరుద్ధరించడం లో మత్తు వైద్యసేవలు ప్రధాన భూమిక పోషించడం ద్వారా క్రిటికల్ కేర్ విభాగంలో కీలకంగా మారింది. ప్రమాదాలు సంభవించి నప్పుడు ట్రామాకేర్ లోనూ, ప్రకృతి విలయాల్లోనూ, మాస్ క్యాజువాలిటీల్లో ముఖ్య భూమిక పోషించడం ద్వారా వైద్యరంగంలో అనస్థీషియా వైద్యులు కీలకంగా మారారు.

# పోషకాహార లోపమే వ్యాధులకు మూలం



ఈరోజుల్లో అన్నం విలువ కొంత మందికే తెలుస్తుంది. ఎందుకంటే అన్నం తినేవాడి కన్నా దానిని పండించే వారికే దాని యొక్క విలువ తెలుస్తుంది. ఆహారం పారేయడానికి ఒక్క నిమిషం చాలు, కాని ఆ ఆహారాన్ని పండించ డానికి కనీసం మూడు నెలలు పడుతుంది. ఆ విషయం తెలియక చాలా మంది దానిని వృథా చేస్తారు. దీనికి సంబందించే అంటే ఆహార భద్రతను దృష్టిలో పెట్టుకొని ఈరోజున ప్రపంచ వ్యాప్తంగా ప్రపంచ ఆహార దినోత్సవం జరుపు కుంటారు. 1945 అక్టోబర్ 16న ఐరాస ఆహార మరియు వ్యవసాయక సంస్థ స్థాపించ బడింది. అయితే ఈ కార్యక్రమాన్ని మొదటి సారి 1981లో జరుపు కున్నారు. ఈ ప్రపంచ ఆహార దినోత్స వాన్ని పురస్కరించుకొని మనం చెయ్యాల్సిందల్లా ఒక్కటే ఆహారాన్ని వృథా చేయరాదు. ప్రజల్లో ఈ విషయంలో చైతన్యం నింపాలనే ఉద్దేశంతో ఐక్యరాజ్య సమితి 1945 అక్టోబర్ 16న 'ఆహార, వ్యవసాయ సంస్థ' ను ప్రారంభిం చారు. ఈ సంస్థను ఆంగ్లంలో %ఖీూూ% అంటారు. అంటే ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్. ఈ సంస్థ గౌరవార్థం ఈ సంస్థ ఏర్పడిన అక్టోబరు 16 తేదిని ప్రపంచ ఆహార దినోత్సవంగా నిర్ణయించారు. అప్పటి నుంచి ఇదే రోజున ప్రతి సంవత్సరం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తూ వస్తున్నారు. ప్రతి ఏటా 150 కంటే ఎక్కువ దేశాలలో ఆహార దినం పాటిస్తున్నారు. ఒకరు రోజంతా కష్టపడి కూలి పనులు చేసి డబ్బు సంపాదిస్తారు. ఇంకొకరు రోజంతా ఏసీ గదుల్లో కంప్యూటర్ల ముందు కూర్చొని కుస్తీ పడతారు. ఎవరు ఎలా కష్టపడినా... కడుపు నింపు కోవడానికే. కోటి విద్యలు కూటి కోరకే... అని మన పెద్దలు ఎప్పుడో చెప్పారు. ముందు కడుపు నిండాకే మనిషి మరో దాని గురించి ఆలోచిస్తున్నాడు. ప్రస్తుతం కనీస అవసరాల కిందకి చాలా వచ్చాయి. ఎన్ని ఆ జాబితాలో చేరినా మొదటి స్థానంలో ఆహారమే ఉంటుంది. ఎందుకుంటే... ఆహారం లేకుండా సృష్టిలో ఏ ప్రాణి జీవించలేదు కాబట్టి. కానీ ప్రస్తుత రోజుల్లో మనుషులు లక్షల రూపాయలు సంపాదిస్తున్నా కూడా కడుపు నిండా భోజనం చేయడం లేదు. బరువు పెరుగు తామనో, లావు అయి పోతామనో ఇలా కారణాలు చెబుతున్నారు. కొందరేమో తినడానికి తిండి లేక అవస్తలు పడుతున్నారు. ఈ రెండు కారణాల వల్ల పోషకాహార లోపాన్ని ఎదురు కుంటున్న వారు చాలా మంది ఉన్నారు. ఈ రోజు ప్రపంచ ఆహార దినోత్సవం. ఈ సందర్భంగా ఎలాంటి ఆహారం తినాలనే విషయాలపై అవగాహన అవసరం. ప్రతి ఒక్కరికీ ఆరోగ్యకరమైన ఆహారాన్ని ఈ ఆహార దినోత్సవం సందర్భంగా ఎలాంటి జబ్బుల బారిన పడకుండా ఉండేందుకు అవసరమైన ఆహారం తీసుకోవాలి. పండ్లు, కూరగాయలు, పప్పు ధాన్యాలతో పాటు గింజలు, విత్తనాలు, పల్లీలు, శనగలు, ఉలవలు, బొబ్బర్లు, జీడిపప్పు, బాదం పప్పు, వాల్ నట్స్ వంటిని ప్రతి రోజూ తీసుకోవాలి. భారతీయులు రోజూ కనీసం 400గ్రాముల కూరగాయలు, పండ్లు తీసుకోవాలని భారత పోషకాహార సంస్థ చెబుతోంది. రాగులు, జొన్నలు, వరి, గోధుమ వంటి ధాన్యాన్ని కూడా ఎక్కువగా తీసుకోవాలి. మరీ ప్రత్యేకంగా కొవ్వులు, చెక్కర, ఉప్పు వాడకాన్ని చాలా తక్కువగా వాడటం ఉత్తమం. 50శాతం కేలరీలు అందిస్తున్న పంటలు 8 రకాలు ఉన్నాయి. బార్లీ, బీన్స్, వేరుశెనగ, మొక్కజొన్న, వరి, జొన్న, గోధుమలు వీలైనంత ఎక్కువగా ఆహారంలో భాగం చేసుకోవాలి. బయట లభించే ఆహారాలకు ఎంత దూరంగా ఉంటే అంత మంచిదని నిపుణులు చెబుతున్నారు. ఫాస్ట్ ఫుడ్ అసలు తినకపోవడం చాలా మంచిది. చిన్నారులకు కనీసం 9నెలల వరకు తల్లిపాలు ఇవ్వాలి. పుట్టగానే డబ్బా పాలను అలవాటు చేస్తే.. అప్పటి నుంచే వారిలో పోషకాహార లోపం తలెత్తే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. పోషకాహారం తీసుకోవడంతో పాటు తగినంత వ్యాయామం చేయడం కూడా చాలా అవసరం. మన భూమి మీద మనిషి తినగలిగే మొక్కల జాతుల సంఖ్య దాదాపు 30వేలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. ప్రపంచ వ్యాప్తంగా 852 మిలియన్ల మంది దీర్ఘకాలంగా అతి పేదరికం కారణంగా ఆకలితో అలమటిస్తున్నారు. ఈ సంఖ్య నిరంతరం పెరుగుతూనే ఉంది. అందుకు కారణాలు అనేకం. విపరీతమైన జనాభా పెరుగుదల, వాతావరణ మార్పు, ఆహార ధాన్యాలను జీవ ఇంధనాల కోసం ఉపయోగించడం, మౌలిక ఆహార ధాన్యాల ఉత్పత్తి తగ్గించి లాభదాయకమైన వాణిజ్య పంటలవైపు మొగ్గు చూపడం... ఇలా ఎన్నో కారణాలు. వీటి పర్యవసానంగా ఆహార ధాన్యాల ధరలు అందుబాటు లోకి లేనంతగా పెరగడం మరో సమస్య. ప్రపంచ జనాభాలో దాదాపు సగం పట్టణాలు, నగరాలలో జీవిస్తున్నారు. అభివృద్ధి చెందుతున్న దేశాలలో 70 శాతం కంటే ఎక్కువ మంది పల్లెల్లో నివసిస్తున్నారు. అయినా అనేక కారణాలవల్ల వ్యవసాయం కుంటుపడింది. ఆఫ్రికాలో కొన్ని దేశాలలో కరువు నిత్యం తాండవిస్తూనే ఉంది. ఆసియాలో దాదాపు 60 శాతం జనాభా పోషకాహార లోపంతో బాధ పడుతున్నారు. అదే ఆఫ్రికాలో ఆ శాతం 75 దాటింది. దాదాపు 22 దేశాలలో (వాటిలో 16 ఆఫ్రికాలోవే) పోషకాహార లోపం 35 శాతం దాటిందని తేలింది. భారతావనిలో విస్తారమైన కోట్లాది ఎకరాల భూములుండి, లక్షలాది ఎకరాల పంట భూములలో పప్పు ధాన్యాలు, తదితర ఆహార ధాన్యాలతో విలసిల్లింది. ఆహార ధాన్యాల ఉత్పత్తిలో అగ్రగామిగా నిలిచిన మనదేశం స్వాతంత్ర్యం వచ్చి ఏడు దశాబ్దాలు దాటినా, పాలకుల పేదరిక నిర్మూలనా పథకాలు, లక్షల, కోట్ల పంచ వర్ష ప్రణాళికలు ఈ ఏడు దశాబ్దాల్లో పేదరికం ఆకలి తీర్చలేదు. పేదలు దరిద్రులుగా, ధనికులు బిలియనీర్లు, ట్రిలియనీర్లు కావటానికి ఉపయోగపడ్డాయి తప్ప, సగటు మనిషి ఆకలి తీర్చటంలో విఫలమయ్యాయి. దేశ స్థూల జాతీయాదాయం చూపి చంకలు గుద్దుకుంటున్న పాలకులు జాతీయాదాయంతో పాటు, జాతులకు ఆహార భద్రత కల్పించటంలో విఫలమయ్యారు. దీనికి ఉదాహరణ పనికి ఆహార పథకంలో అవినీతి, పేదలకిచ్చే సబ్సిడి ఆహార భద్రత కార్డుల్లో అవినీతి, ఆహార అవసరాలు తీర్చుట గురించి అవకాశం కల్పించినా రైస్‌మిల్లర్ల మాయాజాలం వెరసి అవినీతి ఎందెందు వెతికినా అందందు కలదన్నట్టు అవినీతి బీజాలు మహా వృక్షాలై పాలకుల ప్రజాస్వామ్య వ్యవస్థను వెక్కిరిస్తున్నాయి. వ్యవసాయ రంగానికి ఒక సమగ్ర విధానమంటూ లేకపోవటంతో వ్యవసాయాన్ని సమాధిచేసి, ఉన్న వ్యవసాయంలో వాణిజ్య పంటలను ప్రోత్సహించింది. ప్రపంచ వేదికల్లో గొప్పలకు పోయే మన పాలకుల ఏలికలు వాస్తవ పునాదులపై నిలబడి, మాటల్లో కాకుండా ఆచరణతో కూడిన ఆహార భద్రత పరిష్కా రానికి పూనుకోవాలి. అదే జాతీయ ప్రయోజనాలకు,జాతి ప్రయోజనాలకు శ్రేయస్కారం.

# విద్యారంగాన్ని బలోపేతం చేద్దాం!

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఇటీవల స్కిల్ యూనివర్సిటీని పెట్టి, ఐటిఐలకు అనుసంధానం చేసి, కార్పొరేట్ కంపెనీలకు ఎటాచ్ చేసి ఉద్యోగాలను కల్పించాలనే భావన హర్షణీయం.రాష్ట్రంలోని ప్రభుత్వ, స్థానిక, సంస్థల పాఠశాలల్లో 11,062 ఉపాధ్యాయ పోస్టులను డీఎస్సీ ద్వారా భర్తీ చేయాలనుకోవడం, కార్యరూపం దాల్చడం శుభపరిణామం. భారత ప్రభుత్వం జాతీయ విద్యా పాలసీ 2020 (ఎన్ఇపి 2020)లో మన దేశానికి ఒక మిలియన్ పైగా ఉపాధ్యాయుల అవసరం ఉన్నట్లు అంచనా వేసినప్పటికీ క్షేత్రస్థాయిలో గణాంకాల ప్రకారం 2.5 లక్షల పైగా ఉపాధ్యాయ ఖాళీలు ఉన్నట్లు నిర్ధారించారు. ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయడానికి, కేవలం ప్రభుత్వానిదే బాధ్యత కాదు, ప్రజలందరి బాధ్యత. ప్రతి ఒక్కరూ విద్యార్థి భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని విద్యా రంగాన్ని బలోపేతం చేయవలసిన అవసరం ఉంది. "మీ పైన ఉన్న బల్బును చూస్తే, మీకు థామస్ అల్వా ఎడిసన్ గుర్తుకు వస్తారు. టెలిఫోన్ బెల్ మోగినప్పుడు మీకు అలెగ్జాండర్ గ్రాహం బెల్ గుర్తుకు వస్తారు. నోబెల్ బహుమతి పొందిన మొదటి మహిళా వ్యక్తి మేరీక్యూరీ. మీరు నీలాకాశాన్ని చూసినప్పుడు, మీకు గుర్తుకు వచ్చేది సర్.సి.వి. రామన్". మాజీ రాష్ట్రపతి స్వర్గీయ డాక్టర్ ఎ.పి.జె. అబ్దుల్ కలామ్ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించినప్పుడు మాట్లాడిన మాటలివి. ప్రతి విద్యార్థి పరిశోధనలపై, తన సొంత ఆలోచనలను పదును పెట్టి, మన దేశ ఖ్యాతిని నిలబెట్టాలి. ప్రతి ఉన్నత పాఠశాలలో, ప్రతి జూనియర్ కాలేజీలో ప్రభుత్వం ఒకేషనల్ కోర్సులను ప్రవేశపెట్టాలి. ఐ.టి.ఐ.లకు ప్రాధాన్యతను ఇవ్వాలి. ప్రభుత్వం సైన్స్ అండ్ టెక్నాలజీ, పరిశోధనా రంగంలో ప్రాముఖ్యతనిస్తే, తయారీ, నిర్మాణం, పునరద్పాదకత, ఇంధన వనరులు, రవాణా తదితర రంగాల్లో భారీ ఎత్తున ఉపాధి అవకాశాలు పుట్టుకొస్తాయి. స్వర్గీయ డా. అబ్దుల్ కలాం మాజీ రాష్ట్రపతి ఎక్కడో రామేశ్వరంలో డైలీపేపర్లు వేసుకుంటూ జీవించిన ఓ పిల్లాడు, రోజు రోజుకు ఎదుగుతూ, దేశం గర్వించదగ్గ సైంటిస్ట్‌గా మారడం, తదనంతరం దేశ రాష్ట్రపతిగా ఎదగడం, పద్మభూషన్, పద్మవిభూషణ్, భారతరత్న మొదలగు అతి గొప్ప అవార్డులు పొందడం, దేశం గర్వించదగ్గ విషయం. ఆయన నేటి విద్యార్థులకు ఆదర్శం, విద్యార్థులలో విజ్ఞానాన్ని నింపడానికి ప్రయత్నం చేశాడనీ, భారత రాష్ట్రపతిగా ప్రపంచ శాంతి కోసం పరితపించాడనీ కొనియాడుతూ.. ఐక్యరాజ్య సమితి ఆయన జయంతి రోజైన 15 అక్టోబర్‌ను ప్రపంచ విద్యార్థుల దినోత్సవంగా నిర్ణయించింది. ఆయన భారతదేశానికి 11వ రాష్ట్రపతి(2002-2007) రాజకీయ నాయకుడిగా, శాస్త్రవేత్తగా, ఉపాధ్యాయుడిగా ఉండి, 27 జులై 2015న ఐఐఎం షిల్లాంగ్‌లో విద్యార్థులకు ఉపన్యాసం ఇస్తూనే తన 83వ ఏట గుండెపోటుతో మరణించాడు. ఉపాధ్యాయులు సమాజ నిర్మాతలుగా ఉండి, విద్యార్థుల్లో జ్ఞానాన్ని, నైపుణ్యాలను పెంపొందిస్తేనే మంచి సమాజం నిర్మితమవుతుందని డా. అబ్దుల్ కలామ్ అన్నారు. ప్రభుత్వాలు, విద్యారంగ నిపుణుల సలహాలు తీసుకుని, విద్యార్థులను దృష్టిలో పెట్టుకొని ప్రణాళికలు వేయాలి. అధికారంలోకి వచ్చిన ప్రతి ప్రభుత్వం తన ఇమేజ్ కొరకు కొత్త తరహా పాఠశాలలను, కళాశాలలను నెలకొల్పడం, పాఠశాలల విద్యా నాణ్యతను పట్టించుకోకుండా కేవలం పాఠశాలలు, కళాశాలల సంఖ్యను పెంచడం పైనే దృష్టి పెట్టింది. కనీసం ఇప్పుడైనా విద్యా నాణ్యతను పెంచడంపై ప్రస్తుత ప్రభుత్వం దృష్టి పెట్టాలని ఆశిద్దాం. తెలంగాణ ప్రభుత్వం విద్యారంగానికి కేవలం 7.3% మాత్రమే నిధులు కేటాయించింది. 2022-23 సంవత్సరంలో దాదాపు 8500 ప్రభుత్వ పాఠశాలల్లో 20 మంది కన్నా తక్కువ విద్యార్థులున్నారు. 1864 ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులే లేరు. పాఠశాలల, కళాశాలల పర్యవేక్షణాధికరులు సరిపోయినంత మంది లేరు. ప్రస్తుతం ఉన్న పాఠశాలల్లో టీచర్ పోస్టులు చాలా వరకు ఖాళీగా ఉన్నాయి. ప్రభుత్వ యూనివర్సిటీలలో 2వేలకు పైగా ప్రొఫెసర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. రాష్ట్రంలోని సెకండరీ విద్యాశాఖలో 64 డిప్యూటీ జిల్లా విద్యాశాఖాధికారుల పోస్టులు, 8 జిల్లా విద్యాశాఖాధికారుల పోస్టులు ఉపాధ్యాయులను తయారు చేసే డైట్ కళాశాలల్లో 189 లెక్చరర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రస్తుతం ఉన్న ప్రభుత్వ గురుకుల విద్యాలయాలు, ఆదర్శ పాఠశాలలు, కెజిబివి పాఠశాలల నాణ్యతపైన ప్రభుత్వం దృష్టి పెట్టవలసిన అవసరం ఉంది. ప్రతి ప్రభుత్వ పాఠశాలలో సరిపడా తరగతి గదులు ఉన్నాయా? లేదా? సబ్జెక్టుకు ఒక ఉపాధ్యాయుడు ఉన్నాడా, మరుగుదొడ్లు, నీటి సౌకర్యం ఉందా? ఇటువంటి విషయాలపైనా ప్రభుత్వం దృష్టి పెట్టవలసిన అవసరం ఉంది.

# సాహిత్యంపై తెన్నేటి సంతకం

తెలుగులో ప్రముఖ కవులు, రచయితలలో ఒకరు తెన్నేటి సూరి. అభ్యుదయ కవి. నవలాకారుడు, అనువాదకుడు. తన భావజాలాన్ని ఆవిష్కరించడానికి ఆయన... కథ, వ్యాసం, కవిత, గేయం, నాటకం, నవల, అన్ని సాహిత్య ప్రక్రియలను ప్రజల గుండె తలుపులను తట్టే సాధనాలుగా వాడుకున్నారు. అలనాటి మేటి పత్రికలు భారతి, ఆంధ్ర పత్రికల సహాయ సంపాదకునిగా బాధ్యతలు నిర్వహిస్తూనే తన సాహితీ క్షేత్రం సుసంపన్నం చేయ గలిగిగారు. తెన్నేటి సూరి పేరుతో మొట్టమొదట స్ఫురించేది ఆయన చారిత్రక నవల...ఛంఘిజ్‌ఖాన్. 12, 13 శతాబ్దాలలో మంగోల్‌లో జన్మస్థలంగా, ఎడారిలో ఒక మహా సామ్రాజ్యాన్నే నిర్మించిన విజేత చంఘిజ్‌ఖాన్. అది కత్తి మీద సాములాంటి రచనలో చరిత్రలో జరిగిన సంఘటనలను వక్రీకరించకుండా, హెన్రీ హొవర్త్ దంపతులు రచించిన మంగోల్ చరిత్రను ఆధారంగా చేసుకొని, లోతుగా అధ్యయనం చేసి, చేయి తిరిగిన నవలాకారునిగా అద్భుత రచనతనదైన శైలిలో రచించారు. ఆ ప్రచురణ విశేష ప్రజాదరణ పొందింది. తెన్నేటి సూరి చెంఘిజ్ ఖాన్ తొలిగా ఆంధ్రపత్రిక, 1950 సెప్టెంబరు నుంచి ధారావాహికంగా ప్రచురింప బడింది. సెప్టెంబరు 1998) రేడియో నాటకంగా శ్రీ ఇంద్రగంటి శ్రీకాంతశర్మ అనుసరించి ప్రసారం చేశారు. ఆంధ్ర పత్రికలో ఆయన వ్రాసిన ధారావాహికను నవలా రూపంలో విశాలాంధ్ర వారు ప్రచురించగా, 1956 లో ప్రచురించబడిన ఒక నవల ఎనిమిది పునర్ముద్రణలు జరుపుకోవడం రచయిత గొప్పతనమే. తెన్నేటి సూరి (1911 - 1958 అక్టోబరు 16) తెలుగు రచయిత. అభ్యుదయ కవి, కథారచయిత, నాటకకర్త. ఛంఘిజ్ ఖాన్ నవలా రచయితగా సుప్రసిద్ధుడు. భారతి, ఆంధ్ర పత్రికలలో 1945-1957లలో పత్రికా రచయితగా పనిచేశాడు. సూరి 1911లో కృష్ణా జిల్లా తెన్నేరులో వెంకట లక్ష్మమ్మ, తండ్రి తిరుమలరావు దంపతులకు జన్మించాడు. పుట్టిన ఊళ్లోనే ప్రాథమిక విద్య పూర్తిచేసి, పై చదువులకి బందరు వెళ్లాడు. అక్కడే సాహిత్య రచనా వ్యాసంగానికి అంకురార్పణ జరిగింది. కొందరు పత్రికాధిపతులతో పరిచయం ఏర్పడింది. వారి మద్దతుతో ఓ ప్రెస్ లో ఉగ్యోగం లభించింది. 1940 దశకంలో స్వాంతంత్ర ఉద్యమం వువ్వెత్తున ఎగసిపడుతున్న సమయంలో , తెలంగాణలో నిజాం నిరంకుశ పాలనలో, భుస్వామ్య వ్యవస్థలో, అణచివేతల నేపథ్యంలో చెలరేగిన రైతాంగ పోరాటం చోటు చేసుకున్న తరుణంలో , తన సొంత ఇంట్లో అందరూ కాంగ్రెస్ వాదులుగానే ఉన్నా, నిరంకుశత్వం ఎక్కడ ఉన్నా దానికి వ్యతిరేకంగా తన కలాన్ని ఝుళిపించడం తక్షణ కర్తవ్యమని భావించారయన. ఇతర పత్రికల రచనలకు భిన్నంగా, తమ కుటుంబ సభ్యుల అభీష్టానికి వ్యతిరేకంగా రచన ప్రారంభించాడు. తాను పనిచేసే ప్రెస్సే ఒక సాహిత్య వేదికగా, ఒక చర్చా వేదికగా మలుచు కున్నారు. ప్రెస్‌లో పని చేస్తూనే ఆయా పత్రికలకి వ్యాసాలు రాయడం మొదలు పెట్టాడు. పనిచేసే ప్రెస్సే సాహిత్య వేదికగా, కార్మిక కర్షక కూడలిగా మారింది. మహిళా చైతనం కోసం పాటలు రాసాడు. ఫాసిజాన్ని ఖండించాడు. పిల్లల కోసం వారి బాణీల్లో పాటలు, బాల గేయాల రాసేవాడు. "గొడ్లకాడ" అనే నాటకం కూడా రాసి ప్రదర్శించాడు. తెలంగాణ రైతాంగ పోరాటం గురించి ఆంధ్ర ప్రాంతంలో సానుభూతి సంపాదించడం కోసం పాటలు రాసాడు. పని చేస్తున్న ప్రెస్సు మూత పడ్డాక ఆంధ్రపత్రికలో చేరాడు. రచయితగా మన్ననలను పొందాడు. ఆంధ్ర పత్రిక సారస్వతాను బంధం సంపాదక బాధ్యతలు సమర్థ వంతంగా నిర్వహించాడు.ప్రజానాట్య మండలికి ఎన్నో పాటలు రాసి వారికి అందించగా, సూరి రాసిన పాటల్ని బుర్రకథల్లో, ఇతర ప్రదర్శన కళారూపాల్లో ఉపయోగించి, కళాకారులు ఎన్నో పాటలు, కళారూపాల ద్వారా ఫాసిస్టు వ్యతిరేక ప్రచారం చేశారు. సూరి తెలంగాణ రైతాంగ పోరాటంలో ఎంతో ప్రభావితుడయ్యాడు. కలంతోనే కాకుండా గళంతో పాడే పాటల రచయితగా తెలంగాణ పోరాటానికి నోటి పాటలను కంపోజ్ చేసేవాడు. ఆంధ్ర పత్రిక నైజాంలోకి ప్రవేశించేది కాదు. కానీ నోటి పాటలు నిరాఘాటంగా వెళ్ళి వ్యాప్తి పొందేవి. ఆయన పాటలు ప్రజల నోళ్ళలో చిరకాలం నిలిచాయి. సూరి 1958, అక్టోబరు 16న ఈ లోకాన్ని వదిలి వెళ్ళినా, ఆయన పాడిన పాటలు, కూర్చిన బాణీలు నిత్య ఆయన్ని సజీవంగా ఉంచాయి.

# హనుమాన్ మందిరంలో ప్రారంభమైన సప్త కార్యక్రమం

**అగ్నిధారన్యూస్ "(సంగారెడ్డి)"** :సంగారెడ్డి జిల్లా మండలకేంద్రమైన రాయికోడ్ లోని హనుమాన్ మందిరం పునఃప్రారంభిస్తున్న సందర్భంగా 15వతేది మంగళవారం నుండి 21వతేది సోమవారం వరకు నిరంతరం విరామం లేకుండా భగవంతుణ్ణి నామస్మరణ తో భజన చేస్తూ సప్త కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, అలాగే 19వతేది శనివారం దేవిదేవతల విగ్రహాల ఊరేగింపు,మంటప ప్రవేశం పుణ్యవచనము,ఋత్విక వరము,దేవతలకు మంటప ఆహ్వానము, సర్వతో భద్రమండలం,వాస్తు మండలం,నవగ్రహ మండలం,ఆహ్వానం, స్థాపణము,పూజనం,అగ్నిమంథనం,విగ్రహాలకు ధాన్యాధివాసం,నవగ్రహ హెూమం,జలదివాసం,తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించి మహాహారతి ఇచ్చి తీర్థప్రసాదాల వితరణ20వతేదీన స్వస్తి వాచనము,మూలవిరట్ ఆంజనేయస్వామికి మాన్యుసూక్తముచే అభిషేకం,మంటప దేవత హెూమం,మహా గణపతి హెూమం, పురుషాసుక్త, శ్రీసూక్త,రుద్ర,మాన్యు హెూమం,దేవత విగ్రహాలకు స్థాపణము,శ్యయది వాసము,పుష్ప పలది వాసము,మహాహారతి, తీర్థప్రసాదాల వితరణ 21వ తేదీన వేదఘోష,మంటప దేవత,షోడశ ఉపచార పూజ,స్వస్తివాచనము హెూమం,యంత్ర ప్రతిష్ట తదితర పూజాకార్యక్రమాలు నిర్వహించి మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఉత్సవ నిర్వాహకులు తెలిపారు,ఈ కార్యక్రమానికి సద్గురు మాధవనంద సరస్వతి స్వామి,సద్గురు సోమలింగా శివాచార్య స్వామి,వైరాగ్య శిఖమణి అవధూత గిరి మహరాజ్, సద్గురు చిన్మయ జ్ఞాని చెన్న మల్లిఖార్జున స్వామి తదితరులు పాల్గొననున్నారు.



# అక్రమ నిర్మాణం తొలగించాలి






ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘం నాయకులు.

మామిడిపల్లి బాపయ్య.

**అగ్నిధారన్యూస్,( రామగుండం)** : గోదావరిఖని పట్టణంలోని, రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ ఆఫీస్ ముందు గల, కానిస్టేబుల్ ఆర్నకొండ, సదానందం ఇంటి నిర్మాణం విషయంలో సింగరేణి ఆర్జీ,వన్ ఎస్టేట్ ఆఫీసర్ సాంబశివరావు కుల వివక్షత తోటే ఇంట్లోకి వెళ్లకుండా గోడ పెట్టించారని ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం నాయకులు ఆరోపించారు, ఈ మేరకు మంగళవారం కానిస్టేబుల్ ఆర్నకొండ సదానందం ఇంటికి వెళ్లకుండా నిర్మించిన గోడ స్థలాన్ని ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జాతీయ ఉపాధ్యక్షులు మామిడిపల్లి బాపయ్య, జాతీయ కార్యదర్శి కొంకటి లక్ష్మణ్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు బొంకూరి మధు లు పరిశీలించారు. రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ ఆఫీస్ ముందుగల,, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం నుండి, రాజేష్ టాకీస్ ముందుగల జై భీమ్ నగర్ వరకు ఎక్కడ ఏ ఇంటికి కూడా ఇంట్లోకి వెళ్లకుండా గోడ పెట్టించని, సింగరేణి ఎస్టేట్ ఆఫీసర్ సాంబశివరావు, కానిస్టేబుల్ ఆర్నకొండ, సదానందం ఇంటి నిర్మాణానికి అన్ని రకాల అనుమతులు ఉన్నప్ప టికీ, ఎస్సీ కులం పేరుతో దూషించడమే కాక ఇంట్లోకి వెళ్లకుండా గోడపెట్టి కుల వివక్ష చూపించారని ఆరోపించారు, ఆర్నకొండ సదానందం ను, సింగరేణి ఎస్టేట్ ఆఫీసర్ సాంబశివరావు డబ్బులు అడిగితే ఇవ్వకపోవడం వల్లనే,ఇంటికి వెళ్లకుండా గోడ పెట్టించారని అన్నారు, సాంబశివరావు సింగరేణి ఆర్ జీ,వన్ ఎస్టేట్ ఆఫీసర్ గా విధులు నిర్వహిస్తున్నప్పటి నుండి, పనిచేసిన కాలంలో జరిగిన అక్రమంగా నిర్మించిన ఇంటి నిర్మాణాల విషయంలో కొంతమంది వద్ద డబ్బులు తీసుకున్న ఆధారాలను సేకరించడం జరుగుతుందన్నారు, సాంబశివరావు చేసిన తప్పులను కప్పిపుచ్చుకునేందుకే, కానిస్టేబుల్ ఆర్నకొండ సదానందం పై పోలీస్ స్టేషన్లో కౌంటర్ గా, తప్పుడు కేసులు పెడుతున్నారని అన్నారు, ఆర్నకొండ సదానందం పై సాంబశివరావు వ్యవహరించిన తీరును, పూర్తి నివేదికతో సింగరేణి సి అండ్ ఎం డి బలరాంని కలిసి నివేదిక అందజేస్తామన్నారు, సింగరేణి సి అండ్ ఎండి బలరాం ఇతర డైరెక్టర్ల నేతృత్వంలో సింగరేణి సంస్థ అభివృద్ధి దిశలో పరుగులు తీస్తుంటే సాంబశివరావు లాంటి అధికారుల వల్ల, మరో కొంతమంది సింగరేణి ఎస్టేట్ అధికారులు అబాసు పాలు అవుతున్నారని అన్నారు, సింగరేణి ఆర్జీ,వన్ జీఎం లలిత్ కుమార్ తగిన చర్యలు తీసుకొని గోడను కూల్చి వేయించి,కానిస్టేబుల్ ఆర్నకొండ సదానందం కు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు, అదేవిధంగా సింగరేణి ఎస్టేట్ డిపార్ట్మెంట్ ,సెక్యూరిటీ డిపార్ట్మెంట్లో కూడా అనేక అవకతవకలు చోటు చేసుకుంటున్నాయని ఈ విషయాలన్నిటిని నివేదిక రూపంలో సింగరేణి సి అండ్ ఎండి దృష్టికి తీసుకువెళ్తామన్నారు, వీటిపై విజిలెన్స్ ఎంక్వైరీ చేపడితే సాంబశివరావు సింగరేణి సెక్యూరిటీ విభాగం లో పనిచేస్తున్న కొంతమంది అధికారుల బాగోతం బయటపడుతుందన్నారు , కానిస్టేబుల్ సదానందమును డబ్బులు అడిగిన కారణంగా డబ్బులు ఇవ్వకపోవడంతో కుల వివక్షతతో వ్యవహరించి ఇంట్లోకి వెళ్లకుండా గోడ పెట్టి కులవివక్ష పాటించిన సింగరేణి ఎస్టేట్ అధికారి సాంబశివరావు పై చర్యలు తీసుకోవాలని అదేవిధంగా గోదావరిఖని వన్ టౌన్ పోలీస్ స్టేషన్ లో సాంబశివరావు పై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు కావడం జరిగిందని తక్షణమే పోలీసులు సాంబశివరావును అరెస్టు చేయాలని విజ్ఞప్తి చేశారు, సంఘటన స్థలాన్ని పరిశీలించిన వారిలో, 32 డివిజన్ కార్పొరేటర్ అయిత శివ, మాదిగ జన చైతన్య సమితి పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు కనుకుంట్ల రమేష్, అంబేద్కర్ సంఘం నాయకులు ఏ వెంకన్న తదితరులు ఉన్నారు,

# మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజెత



మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డోకూరి ప్రభాకర్ రెడ్డి

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** : తలకొండపల్లి మండలం అంతారం గ్రామనికి చెందిన కావలి "చిన్న జంగమ్మ అనారోగ్యంతో బాధపడుతూ మరణించడం జరిగింది. ఈ విషయాన్ని గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకుల ద్వారా తెలుసుకున్న మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డోకూరి ప్రభాకర్ రెడ్డి మృతురాలి పట్ల సానుభూతి తెలుపుతూ 3000/- రూపాయలు ఆర్థిక సహాయం వారి కుటుంబానికి అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీతోనే దేశ అభివృద్ధి భద్రత సాధ్యం

## బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్ పద్మ అనిల్ ముదిరాజ్



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** : తలకొండపల్లి మండల కేంద్రంలో బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్ అనిల్ ముదిరాజు మాట్లాడుతూ, తలకొండపల్లి పట్టణ కేంద్రంలో పర్యటన చేస్తూ కల్వకుర్తి తాలూకా ప్రజలు పెద్ద ఎత్తున ప్రతి ఒక్కరు బీజేపీ సభ్యత్వం తీసుకోని మోదీ కి మద్దతుగా నిలవాలని, దేశ అభివృద్ధిలో భాగస్వామ్యులు కావాలని కోరడం జరిగింది.ప్రజలుకు సభ్యత్వం గురుంచి చెప్పగానే స్వచ్ఛందంగా బీజేపీ సభ్యత్వన్ని స్వీకరిస్తున్నారు అన్నారు.బీజేపీ కుటుంబంలోనికి 1000 మంది సభ్యులను చేర్చడం జరిగింది అని మరింత మంది సభ్యత్వం తీసుకోవడం కోసం పోటీ పడుతున్నట్లు ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# అంతిమయాత్రలో పాల్గొన్న గోమాస

**అగ్నిధారన్యూస్ (రామగుండం):** :తెలంగాణ నేతకాని మహర్ హక్కుల పరిరక్షణ సంఘం రాష్ట్ర కార్యనిర్వాక అధ్యక్షులు దుర్గం ఎల్లయ్య తండ్రి దుర్గం బిక్కయ్య అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకున్న నేతకాని/ మహర్ హక్కుల పరిరక్షణ సంఘం జాతీయ అధ్యక్షులు ( పెద్దపల్లి బీజేపీ ఎంపీ కంటెస్టెడ్ అభ్యర్థి)గోమాస శ్రీనివాస్ హుటా హుటిన నీల్వాయి గ్రామానికి చేరుకొని రాష్ట్ర అధ్యక్షుడు యేస్కూరి రాజమల్లు తో కలిసి వారి అంతిమయాత్రలో పాల్గొని పాడే మోసి వారికి శ్రద్ధాంజలి ఘటించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి. వారి కుటుంబానికి మనోధైర్యం నింపి తన సహకారం ఎల్లప్పుడూ వారికి కుటుంబానికి ఉంటుందని భరోసా ఇచ్చారు. వారి వెంట రాష్ట్ర ఉపాధ్యక్షులు దాగం మల్లేష్ , రాష్ట్ర ప్రచార కార్యదర్శి కెమెరా దుర్గయ్య ,మంచిర్యాల జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వాసుదేవ్ , , దుర్గం గోపాల్ ,జిల్లా ఉపాధ్యక్షులు బెంబడి గురవయ్య , జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

# మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత



సింగల్ విండో చైర్మన్ జూపల్లి భాస్కర్ రావు

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** : చారకొండ మండలం గోకారం గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ లక్ష్మమ్మ మరణించడం జరిగింది విషయం స్థానిక కాంగ్రెస్ నాయకుల ద్వారా తెలుసుకున్న వెల్దండ సింగిల్ విండో చైర్మన్ భాస్కర్ రావు మృతురాలి కుటుంబానికి 20 వేలు ఆర్థిక సహాయం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో , కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# మండల మాదిగ సంక్షేమ సంఘం కమిటీ ఎన్నిక...



**అగ్నిధార న్యూస్, భీమారం మండలం, అక్టోబర్ 15:** మంగళవారం రోజున జగిత్యాల జిల్లా భీమారం మండల మాదిగ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా దువాస గంగాధర్ ని ఏకగ్రీవంగా కార్యవర్గ సభ్యులు ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షునిగా గడ్డం శశి కుమార్,ఉపాధ్యక్షునిగా తెడ్డు విజయ్. దువాస నారాయణ ప్రధాన కార్యదర్శిగా చిలివేరి వెంకటేష్. క్యాషియర్ గా బంగారు దీపక్, ప్రచార కార్యదర్శిగా ఆరే దరి, కార్యదర్శిగా మకిలి కుమార్ లను ఏకగ్రీవంగా సభ్యులు ఎన్నుకున్నారు.ఈ కార్యక్రమంలో అంబటి గోపి, నల్ల కొండయ్య, బోల్లె అనిల్ ,లింగంపల్లి గణేష్, నల్ల నరసయ్య, సంతోష్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

# అక్రమంగా తరలిస్తున్న పిడిఎస్ బియ్యం పట్టివేత



25 క్వింటాళ్ల పిడిఎస్ రైస్ స్వాధీనం చేసుకున్న టాస్క్ ఫోర్స్ పోలీసులు

**అగ్నిధార న్యూస్,( రామగుండం):** రామగుండము కమిషనరేట్ మంచిర్యాల జిల్లా సీసీసీ నస్పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో టాస్క్ ఫోర్స్ సీఐ రాజ్ కుమార్, ఎస్ఐ లచ్చన్న మరియు టాస్క్ ఫోర్స్ సిబ్బంది అనుమానస్పదంగా వెళుతున్న అశోక్ లెలాండ్ వాహనాన్ని ఆపి తనిఖీ చేసి, అక్రమంగా మహారాష్ట్ర కి తరలిస్తున్న 25 క్వింటాళ్ల పిడిఎస్ రైస్ ను , వాటిని సరఫరా చేసే టీఎస్ యుసి 1578 నంబర్ గల ట్రాలి ను స్వాధీన పరుచుకొని నిందితున్ని అదుపులోకి తీసుకోవడం జరిగింది .

**పట్టుబడిన నిందితుడి వివరములు:**సిరిగిరి సుధాకర తండ్రి సారయ్య, వయస్సు. 21, కులం: బుడిగజంగాల, ఓసిసి . డ్రైవర్, R/O . ఎన్టీఆర్ నగర్, మంచిర్యాల.

**స్వాధీ పరుచుకున్న వాటి వివరములు :**పిడిఎస్ రైస్ 25 క్వింటాళ్ళు వాటి విలువ సుమారు రూపాయలు 50,000/-పట్టుబడిన వాహనాన్ని మరియు నిందితుడిని తదుపరి విచారణ నిమిత్తం సీసీ నస్పూర్ పోలీస్ స్టేషన్ వారికీ అప్పగించడం జరిగింది.

# కిడ్నాప్ కేసులో నిందితులు అరెస్ట్

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** : కడ్తాల మండల కేంద్రంలో టోల్ ప్లాజా దగ్గర గత వారం రోజుల క్రితం వ్యాపార లావాదేవీల కారణంగా ప్రముఖ మైనింగ్ వ్యాపారి, రియాల్టర్ కతల్ ను కిడ్నాప్ చేసి దాడి చేసిన ఘటనలో భాగంగా నిందితులను మంగళవారం అరెస్టు చేసినట్లు కడ్తాల సీఐ శివప్రసాద్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.వనపర్తి జిల్లా పానగల్లు మండలం రేమద్దుల గ్రామానికి చెందిన కతల్ (43)హైదరాబాద్ లో నివాసం ఉంటూ, రియల్ ఎస్టేట్, మైనింగ్ వ్యాపారం కొనసాగిస్తున్నాడు. ఈనెల 5న తన కుమారుడు, బావమరిది తో కలిసి తనపై ఉన్న కేసు విషయ పై వెల్దండ పోలీస్ స్టేషన్ కు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో హైదరాబాద్ వైపు వస్తుండగా మార్గమధ్యలో కడ్తాల్ టోల్ ప్లాజా వద్ద కొంత మంది యువకులు కతల్ ప్రయాణిస్తున్న కారుపై రాళ్లతో దాడి చేసి, ఆయనను బయటకు లాగి, విచక్షణారహితంగా దాడి చేసి, కిడ్నాప్ చేశారు.ఈ సంఘటనపై కతల్ కుమారుడు శ్యాంసుందర్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు తెలిపారు. నిందితులలో మాడ్గుల మండలం చంద్రయాన్ పల్లికి చెందిన అన్వేష్(25),సురేష్(27), వెల్దండ మండలం లింగారెడ్డిపల్లి గ్రామానికి చెందిన నిజా మోద్దీన్(31),అఫ్రోజ్(27)లను ఈ నెల 6న అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించినట్లు తెలిపారు.ఈ కేసులో మరో ఇద్దరు నిందితులు వెల్దండ మండలం పోతేపల్లి గ్రామానికి చెందిన సంజీవ్ యాదవ్ (43), బర్కత్ పల్లి గ్రామానికి చెందిన(25)లను సోమవారం అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు సీఐ తెలిపారు.

# జె కె సీడ్స్ వారి రైతు ప్రదర్శన క్షేత్రం



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి) :** కల్వకుర్తి మండలం పరిధిలోని భగత్ సింగ్ తండా గ్రామంలో జె కె సీడ్స్ వారు రైతు ప్రదర్శన క్షేత్రం నిర్వహించారు. జె కె అగ్రి జెనెటిక్స్ కంపెనీలోని జె కె సి ఎచ్ 99 రకం గురించి రైతులకు సూచనలు చూపించడం జరిగింది. ఈ జె కె సి ఎచ్ 99 రకం రోగ నిరోధక శక్తి ఎక్కువ కల్గిన రకమని,అలాగే ఈ రకం అన్ని రకాల కు పొలంలో అనుకూలమైన పంట దిగుబడి వస్తుంది అని అన్ని వాతావరణాలకు తట్టుకునే విధంగా ఈ సిడ్ ఉందని పొలంలో సాగుచేసిన రైతుకు తెలియజేయడం జరిగింది.ఈ సిడు లో అధిక నూగు ఉండటం వలన చీడపీడలను తట్టుకొని శక్తి ఉంటుంది దీని వలన రైతులకు మందుల పిచికారి తగ్గుతుంది వీటితోపాటు దగ్గర కొమ్మలు అధిక బరువైన కాయలు ఐదు పచ్చల కాయలు ఉండడం వలన పత్తి తీయడం కూడా సులభం అవుతుంది అని వివరించారు. ఈ జె, కె, సి, ఎచు 99 రకం విత్తనాలు శ్రీ తిరుమల ఫెర్టిలైజర్,కల్వకుర్తి లో అందుబాటులో ఉంటుందని టెరిటరి మేనేజర్ కొంగండ్ల మహేష్ గారు సూచించారు.ఒక ఎకరానికి 15-20 క్వింటాళ్ల వరకు దిగబడి వస్తుందని ఈ రకం వేసిన రైతు కుబ్యా గారు చెప్పడం జరిగింది . ఈ కార్యక్రమంలో,ఈక్షేత్ర ప్రదర్శనకు జె కె సీడ్స్ కంపెనీ టీబీఎం మహేష్,మడమ్ శివ, గ్రామ సర్పంచ్,గ్రామ రైతులు,తదితరులు పాల్గొన్నారు.

## పోగొట్టుకున్న సెల్ ఫోన్ అప్పగింత



**అగ్నిధారన్యూస్, వనపర్తి జిల్లా :** సెల్ ఫోన్ పోయిన చూరికి గురైన ఆందోళన చెందవద్దని సీఈఐఆర్ ద్వారా తిరిగి పొందవచ్చని వనపర్తి రూరల్ ఎస్సై జలంధర్ రెడ్డి తెలిపారు. మంగళవారం రూరల్ పోలీస్ స్టేషన్లో ఇటీవల చోరీకి గురైన సెల్ ఫోన్ ను కడుకుంట్ల కు చెందిన వెంకటేష్ కు అందజేశారు. చోరీకి, పోయిన సెల్ ఫోన్ల ను త్వరితగతిన పట్టుకోవడానికి సీఈఐఆర్ ఎంతగానోఉపయోగపడుతుందని అన్నారు.

## అప్పు ఇచ్చిన,తీసుకున్న నిబంధనలు పాటించాలి




### లీగల్ ఏడ్ డిఫెన్స్ కౌన్సిల్ జి.ఉత్తరయ్య

**అగ్నిధారన్యూస్ వనపర్తి జిల్లా :** పెద్దమందడి జగత్ పల్లి గ్రామంలో మంగళవారం వనపర్తి జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు ను నిర్వహించారు.లీగల్ ఏడ్ డిఫెన్స్ కౌన్సిల్ జి. ఉత్తరయ్య గ్రామస్తులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ కుటుంబ అవసరాలకు అప్పుగా తీసుకునేటప్పుడు ఇచ్చేటప్పుడు తగిన నిబంధనలు పాటించాలని అన్నారు. మోటార్ వెహికల్స్ చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని అన్నారు.

## పూర్వ విద్యార్థుల సమ్మేళనం



### పాఠశాలకు 30 కుర్చీలు, సౌండ్ సిస్టం బహుకరణ.

**అగ్నిధార న్యూస్ ( రామగుండం):** పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని పురస్కరించుకొని తాము చదువుకున్న స్కూలుకు 30 కుర్చీలు... కార్డు లెస్ మౌత్ సౌండ్ సిస్టంను బహుకరించారు.. కలవల రామస్వామి... జి తిరుమల.... దేవి లక్ష్మీ నరసయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో... పూర్వ విద్యార్థులు ఎండి ఫసియోద్దీన్... తాటిపాముల రమేష్... పరిచవేని శ్రీనివాస్.. తోడేటి రవికుమార్.. దాడి మహేష్... ఓ లక్ష్మీ నరసయ్య... రేండ్ల శ్రీనివాస్... దార వీణ రాజు.కెఎప్టి శంకర్.. ఎండి తాజుద్దీన్.. ఆంజనేయులు.. ఎం కనకయ్య బోర్ల కనకయ్య గుండేటి రామ్మూర్తి... మాదాసు భూమన్న.. తాటిపాముల కిషన్, దాసరి శంకర్. గణపతి శ్రీనివాస్.. నగునూరి లక్ష్మణ్.. బుర్ర తిరుపతి గౌడ్.. రవి.. మడక కనకయ్య.. కే లింగయ్య.. శ్రీనివాస్.. పెరుమాండ్ల రమేష్..ఇంకా పూర్వ విద్యార్థులు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు...

## తాగునీటి పైపులైనుకు లీకేజీ



### మరమ్మతు చేయించిన బిజెపి జిల్లా అధికార ప్రతినిధి తిరుమలేష్

**అగ్ని ధార న్యూస్ వనపర్తి జిల్లా :**వనపర్తి పట్టణంలోని 24వ వార్డు ప్రజా కవి కాళోజి పార్క్ పక్కన నెల రోజుల నుండి తాగునీటి పైప్‌లైన్ లీకై నీరంతా వృథాగా పక్కనే ఉన్న రహదారి పైకి చేరింది. విషయం తెలుసుకున్న బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి తిరుమలేష్ సమస్యను మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి మంగళవారం మరమ్మతులు చేయించారు. వృథాగా పోతున్న తాగునీటిని చొరవ తీసుకొని పరిష్కరించినందుకు కాలనీవాసులు తిరుమలేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

# మత్తు పదార్థాలపై గట్టి నిఘా

**మాదక ద్రవ్యాల నియంత్రణకు చర్యలు...**

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష.**

**విద్యా సంస్థలలో యాంటి డ్రగ్స్ కమిటీల ఏర్పాటు.**

**గంజాయితో పాటు...! గుడుంబా నివారణకు చర్యలు....!!**




**అగ్నిధారన్యూస్,పెద్దపల్లి, అక్టోబర్ -15 :**జిల్లాలో మాదకద్రవ్యాలను నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు.మంగళవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో మాదక ద్రవ్యాల, డ్రగ్స్ నియంత్రణ కోసం చేపట్టిన చర్యలపై సంబంధిత అధికారులతో జిల్లా స్థాయి నార్కోటిక్ కంట్రోల్ సమావేశాన్ని నిర్వహించారు.జిల్లా నార్కోటిక్ కంట్రోల్ సమావేశంలో జిల్లాలో నమోదవుతున్న ఎన్.డి.పి.ఎస్ కేసులు, గంజాయి సాగు నివారణ చర్యలు, మాధక ద్రవ్యాల వాడకం నియంత్రణ చర్యలు, మాదక ద్రవ్యాల నివారణ కోసం శాఖల వారీగా చేపట్టాల్సిన కార్యక్రమాలు, డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే నష్టాల గురించి చేయాల్సిన విస్తృత ప్రచారం వంటి పలు అంశాలను సుదీర్ఘంగా చర్చించారు.**జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, :**జిల్లాలో ఉన్న కస్తూర్బా గాంధీ విద్యాలయాలు, మోడల్ పాఠశాలలు, వసతి గృహాలు, గురుకుల పాఠశాలల్లో డ్రగ్స్, మాదకద్రవ్యాల వల్ల కలిగే నష్టాలపై వైద్య అధికారులతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ సంబంధిత అధికారులకు సూచించారు. జిల్లాలోని విద్యా సంస్థలలో యాంటి డ్రగ్స్ కమిటీల ఏర్పాటు చేయాలని, డ్రగ్స్, ఇతర మాదకద్రవ్యాలు అలవాటు ఉన్న వారిని గుర్తించి వారిని పునరావాస కేంద్రాల ద్వారా అలవాటు మానిపించాలని అన్నారు.విద్యా సంస్థల్లో నిర్వహించే పేరెంట్ టీచర్స్ సమావేశాలలో డ్రగ్స్ వల్ల కలిగే నష్టాలు, డ్రగ్స్ గంజాయి వంటి మత్తు పదార్థాలకు బానిసలుగా మారితే వచ్చే పరిణామాలు, మాదకద్రవ్యాల బానిసత్వం నివారణకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన డి అడిక్షన్ సెంటర్ మొదలగు అంశాలను వివరించాలని, పేరెంట్స్ చుట్టుపక్కల ఎవరైనా పిల్లలు మాదక ద్రవ్యాలకు అలవాటు పడినట్లు తెలిస్తే వెంటనే సమాచారం అందజేయాలని కలెక్టర్ సూచించారు.డ్రగ్స్ వల్ల కలిగే విపరీత పరిణామా పై అవగాహన వివరిస్తూనే సమాంతరంగా వాటి నియంత్రణకు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని, మాదక ద్రవ్యాల రవాణా, సాగు, వినియోగం నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని అన్నారు. జిల్లాలో గంజాయి తో పాటు గుడుంబా నివారణకు సైతం అవసరమైన చర్యలు కచ్చితంగా చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.



మాదక ద్రవ్యాలకు బానిసైన వారిని గుర్తించి అవసరమైన చికిత్స, కౌన్సిలింగ్ అందించే విధంగా చర్యలు తీసుకోవాలనీ వైద్యారోగ్య శాఖ అధికారులకు సూచించారు. గోదావరిఖని ఆసుపత్రిలో 10 పడకల డీ అడిక్షన్ సెంటర్ ఏర్పాటు చేయడం జరిగిందని, అవసరమైన వారికి ఇక్కడ చికిత్స అందించాలని కలెక్టర్ సూచించారు. అటవీ శాఖ అధికారులు వారి పరిధిలోని అటవీ భూములు పరిశీలించి గంజాయి సాగు కనిపిస్తే వెంటనే పోలీస్ అధికారులకు సమాచారం అందించాలని అన్నారు. జిల్లా లోని ఆసుపత్రులు, మెడికల్ షాపులలో స్టాక్ వివరాలను ప్రతి నెల తనిఖీ చేయాలని కలెక్టర్ డ్రగ్ ఇన్స్ పెక్టర్ కు సూచించారు. చెడు అలవాట్ల వల్ల ఆరోగ్యం దెబ్బ తింటుందని, ఆలోచనా విధానం, ఆలోచనా శక్తి నశిస్తాయని అన్నారు. భావితరాలు మాదక ద్రవ్యాల పట్ల ఆకర్షితులు కాకుండా వారికి సమాజంలో మంచి, చెడు తెలియ జేయాలని కలెక్టర్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పెద్దపల్లి ఏసిపి జి. క్రిష్ణ, గోదావరిఖని ఏసీపీ ఏం. రమేష్, జిల్లా అటవీ అధికారి శివయ్య, జిల్లా ఆప్కారి శాఖ అధికారి మహిపాల్ రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి డి. మాధవి, జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్ ఖాన్ , జిల్లా ఇంటర్మీడియట్ అధికారి కల్పన , కలెక్టరేట్ పర్యవేక్షకులు ప్రకాష్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుంచి కళా ఉత్సవాలు ప్రారంభం

అగ్నిధారన్యూస్ వనపర్తి జిల్లా : నేటి నుంచి పాఠశాల విద్య - కళా ఉత్సవాలు 2024 సంవత్సరానికి సంబంధించిన ఉత్సవాలు ప్రారంభిస్తున్నట్లు వనపర్తి జిల్లా విద్యాశాఖాధికారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాల విద్య - కళా ఉత్సవ 2024 జిల్లా స్థాయి ప్రదర్శన గురించి,డైరెక్టర్ ఆఫ్ సెక్రెటరీ తెలంగాణ, హైదరాబాద్ వారి ఆదేశానుసారం ఈకార్యక్రమాలుజిల్లాలోని సంబందిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ప్రభుత్వ, ప్రైవేటు, జడ్.పి.హెచ్.ఎస్, కేజీబీవీలు, ఆదర్శ పాఠశాలలు, రెసిడెన్షియల్ పాఠశాలలు అందరూ విద్యార్థులను ప్రోత్సహించాలని ఆయన తెలిపారు.ఈ ఉత్సవాలు 16.10.2024 17.10.2024 వరకు రెండు రోజులు నిర్వహించబడతాయి, ఈ కార్యక్రమంలో పాల్గొనే వారు ఉదయం గం. 10.00 లోపు బాలభవన్ వనపర్తి కి చేరుకోవాలని అన్నారు. కళా ఉత్సవంలో నిర్వహించే కార్యక్రమాలు (1) వొకల్ మ్యూజిక్ 2) ఇన్స్ట్రుమెంటల్ మ్యూజిక్ 3) డాన్స్ 4) థియేటర్ 5) విసుఅల్ ఆర్ట్స్ 6) ట్రెడిషనల్ స్టోరీ టెల్లింగ్ నిర్వహిస్తున్నామని తెలిపారు

ఇతర వివరాలకు మహానంది, కో- ఆర్డినేటర్ సెల్ నెం. 9966070911 కు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవచ్చని ఆయన అన్నారు.

# పత్తి కొనుగోళ్లకు అంతా సిద్ధం




**అగ్నిధారన్యూస్, పెద్దపల్లి:**పెద్దపల్లి జిల్లాలోని జిన్నింగ్ మిల్లులలో 2024 ...25 వ సంవత్సరానికి కనీస మద్దతు ధరపై భారత పత్తి సంస్థ పత్తిని కొనుగోలు చేయుటకు సిద్ధంగా ఉన్నారని పెద్దపల్లి జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్ రెడ్డి మంగళవారం ఒక పత్రిక ప్రకటనలు తెలిపారు.పెద్దపల్లి జిల్లాలో ఖరీఫ్ 2024-25 సీజన్ కు గాను సుమారు 51,000 ఎకరాలలో పత్తి పంట సాగైనదని దాదాపు 4,70,000 క్వింటాళ్ల పత్తి దిగుబడి వస్తుందని అంచనా.పత్తి పంట ఈ నెలాఖరు నుంచి మార్కెట్ కు తీసుకురావడం ప్రారంభం అవుతుందని ఆ ప్రకటనలో తెలిపారు.జిల్లాలో 3 మార్కెట్ల పరిధిలో 4 జిన్నింగ్ మిల్లులు... పెద్దపల్లి మార్కెట్ పరిధిలో రెండు, సుల్తానాబాద్ మార్కెట్ పరిధిలో ఒకటి, కమాన్పూర్ మార్కెట్ పరిధిలో మరొకటి జిన్నింగ్ మిల్లులు ఉన్నాయన్నారు.జిల్లా కలెక్టర్ జిల్లాలోని అన్ని జిమ్మింగ్ మిల్లులను పత్తి కొనుగోలు కేంద్రాలుగా నోటిఫై చేయడం జరిగినది తెలిపారు. పత్తి కనీస మద్దతు ధర 7521 ఒక క్వింటాల్కి (8 శాతం తేమ) నిర్ణయించబడినది. ప్రైవేటుపరంగా పత్తి ధర కనీస మద్దతు ధర కన్నా తక్కువగా ఉన్నప్పుడు ప్రభుత్వ రంగ సంస్థ అయిన సిసిఐ కనీస మద్దతు ధరపై పత్తి కొనుగోలు ఏర్పాట్లు చేయుటకు సిద్ధంగా ఉన్నారు అన్నారు. సీసీఐ పత్తి యొక్క తేమశాతం 8 నుంచి 12 శాతం వరకు ఉంటే మాత్రమే పత్తిని కొనుగోలు చేస్తారన్నారు. జిల్లాలోని పత్తి రైతులందరూ ఇట్టి విషయాన్ని గమనించి పత్తి యొక్క ధర కనీస మద్దతు ధర కన్నా తక్కువగా ఉన్నప్పుడు తమ పత్తిని ఎనిమిది నుంచి 12శాతం తేమ ఉండేటట్టు చూడాలని తెలిపారు.

## కేసీఆర్‌కు పట్టిన గతే మీకూ...c

**నిజామాబాద్ :** టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ నిజామాబాద్ పర్యటన సందర్భంగా స్థానిక ఎంపీ అరవింద్‌పై కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ నేపథ్యంలో ఆయన రియాక్ట్ అవుతూ కౌంటర్ ఇచ్చారు. కేసీఆర్‌కు పట్టిన గతే కాంగ్రెస్‌కు పడుతుందని హెచ్చరించారు. మహేష్ గౌడ్ అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. కౌన్సిలర్‌గా కూడా గెలవలేని వారు తన గురించి మాట్లాడతారా అంటూ ఫైరయ్యారు. కాంగ్రెస్ పాలనలో ఆలయాలకు రక్షణ కరువైందని, బీజేపీ అధికారంలోకి వస్తేనే తెలంగాణ అభివృద్ధి చెందుతుందని తెలిపారు. లోక్ సభ ఎన్నికల్లో బీజేపీకి ఓటేసిన ప్రజలు వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కచ్చితంగా వేస్తారని ధీమా వ్యక్తం చేశారు.దేశంలో ఎక్కడా లేనివిధంగా నిజామాబాద్ లోక్ సభ పరిధిలో రైల్వే బ్రిడ్జిలు ఏర్పాటు చేస్తున్నట్టు వివరించారు అరవింద్. 7చోట్ల బ్రిడ్జిల నిర్మాణం జరుగుతోందని, తన వల్లే జిల్లాలో కాంగ్రెస్ వీక్ అయ్యిందని అన్నారు. 93 కోట్ల రూపాయలతో చేపట్టిన మాధవనగర్ ఆర్వోబీ, రోడ్ల విస్తరణ ఇలా నియోజకవర్గానికి చాలా చేశానని వివరించారు ఎంపీ. రాష్ట్ర ప్రభుత్వం నిధుల బిల్లులు సకాలంలో ఇవ్వడం లేదని, రైల్వే రంగాన్ని కాంగ్రెస్ పట్టించుకోలేదని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం నిధులు డిపాజిట్ చేసినా రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించడం లేదన్నారు. మంత్రి కోమటిరెడ్డి అధికారులను, ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని, తన ఫోన్ కూడా లిఫ్ట్ చేయడం లేదని మండిపడ్డారు. జిల్లాకు ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఎందుకు ఇవ్వలేదని ఈ సందర్భంగా ప్రశ్నించారు అరవింద్. రాష్ట్రంలో బీజేపీ అధికారంలో రాగానే, ఎవరిని ఎక్కడ ఉంచాలో తమకు తెలుసని హెచ్చరించారు.

## గేట్లకు తాళాలు వేసిన వారిపై క్రిమినల్ చర్యలు

**హైదరాబాద్ :** రుకుల పాఠశాల గెట్లకు తాళాలు వేసిన వారి పై క్రిమినల్ కేసులు వేయాలని కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసినట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'దసరా సెలవుల అనంతరం విద్యాశాఖకు సంబంధించి గురుకులాలు, కాలేజీలు , పాఠశాలలు ప్రారంభం అవుతున్నాయి. 70 శాతం గురుకులాలు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. ఇది ఈ 10 నెలల్లో పెట్టిన బకాయిలు కాదు.. ఈ విషయాన్ని యజమానులు గమనించాలి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నాయకత్వంలో వివరాలు తెప్పించుకుని సమావేశాలు కూడా నిర్వహించాం. నేడో రేపో నిధులను ప్రభుత్వం విడుదల చేయబోతుంది. ఈ సమయంలో ఎవరి మాటలో పట్టుకుని కావాలని కవ్వింపు చర్యలకు పాల్పడవద్దని కోరుతున్నాను. ఇది మంచిది కాదు. ప్రభుత్వం బకాయిలు చెల్లించే ప్రక్రియ కొనసాగుతుంది. గురుకుల మంత్రిగా విజ్ఞప్తి చేస్తున్నా. గురుకులాలకు పెట్టిన బ్యానర్లను వెంటనే తొలగించాలి. విద్యార్థులకు సక్రమంగా తరగతులు నడిపించే విధంగా చర్యలు తీసుకోవాలి. లేదంటే ప్రభుత్వపరంగా చర్యలు ఉంటాయి.పాత బకాయిలు ఇప్పించే బాధ్యత మాది. నేను, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్ని గురుకులాలపై సమీక్ష సమావేశం నిర్వహించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నాం. గురుకుల భవన యజమానులకు విజ్ఞప్తి వెంటనే బ్యానర్లు తొలగించాలి. విద్యార్థులకు స్వాగతం పలకండి. వారి విద్యా బోధనకు ఆటంకం కలిగిస్తే చట్టపరంగా ఎటువంటి చర్యలు ఉంటాయో మీకు తెలుసు. మీకు బకాయిని చెల్లించే బాధ్యత మాది.. లేదంటే నన్ను గానీ, ముఖ్యమంత్రి గారిని గానీ లేదా అధికారులను కలవండి. పాత బకాయిలతో సహా మెస్ ఛార్జీలు మూడు రోజుల క్రితమే చెల్లించాం. గురుకులాలు తాళం వేసి తలుపులు వేస్తే కఠిన చర్యలు ఉంటాయి. గురుకుల ప్రిన్సిపల్, అర్సీవోలు ఎక్కడైనా యజమానులు ఇబ్బందులు పెడితే పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదులు చేయండి. క్రిమినల్ చర్యలు తీసుకోండి. కలెక్టర్లకు ఆదేశాలు ఇస్తున్నాం.. ప్రత్యామ్నాయంగా అక్కడి నుంచి ఖాళీ చేసి వేరే భవనాలు చూడండి. బకాయిలు చెల్లించే బాధ్యత మాది' అంటూ మంత్రి పేర్కొన్నారు.




## రాంచరణ్ వర్సెస్ నాగచైతన్య..

### తండేల్ రిలీజ్‌పై క్లారిటీ వచ్చేసినట్టేనా..?

టాలీవుడ్ యాక్టర్ అక్కినేని నాగచైతన్య నటిస్తోన్న ప్రాజెక్ట్ తండేల్ రొమాంటిక్ డ్రామా నేపథ్యంలో ప్రాజెక్టుగా తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని చందూ మొండేటి డైరెక్ట్ చేస్తున్నాడు. సాయిపల్లవి ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. ఈ చిత్రాన్ని డిసెంబర్ 20న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేస్తున్నట్టు చాలా రోజుల క్రితమే ప్రకటించగా.. తండేల్ విడుదల వాయిదా పడే అవకాశాలున్నాయంటూ మరో వార్త తెరపైకి వచ్చింది. తాజాగా తండేల్ సంక్రాంతి బరిలో నిలువబోతుందన్న అప్‌డేట్ నెట్టింట హల్ చల్ చేస్తోంది. మరోవైపు రాంచరణ్ టైటిల్ రోల్ పోషిస్తున్న గేమ్ ఛేంజర్ 2025 జనవరి 10న విడుదల కానుందని మేకర్స్ ఇప్పటికే ప్రకటించారని తెలిసిందే. ఇదే నిజమైతే బాక్సాఫీస్ వద్ద గేమ్ ఛేంజర్‌తో పోటీ పడటం ఖాయమైపోయినట్టే. మరి తండేల్ రిలీజ్‌పై మేకర్స్ ఏదైనా క్లారిటీ ఇస్తారేమో చూడాలి. తండేల్‌లో సాయిపల్లవి శ్రీకాకుళం అమ్మాయి సత్య పాత్రలో నటిస్తోంది. 2018లో గుజరాత్ జరిగిన వాస్తవ ఘటనల ఆధారంగా తెరకెక్కుతున్న ఈ మూవీని గీతాఆర్ట్స్‌పై అల్లు అరవింద్ సమర్పణలో బన్నీవాసు నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి అనిరుధ్ రవిచందర్ మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. తండేల్ నాగచైతన్య–చందూ మొండేటి కాంబోలో రాబోతున్న మూడో సినిమా కావడం విశేషం. మేకర్స్ ఇప్పటికే లాంఛ్ చేసిన ఫస్ట్ లుక్‌లో చైతూ మత్స్యకారుడిగా మాస్ లుక్‌లో కనిపిస్తూ సినిమాపై సూపర్ హైప్ క్రియేట్ చేస్తున్నాడు.





## దీపావళి ధమాకా.. ఏకంగా ఆరు సినిమాల సందడి

ప్రతీ యేటా పండుగల సీజన్‌లో కొత్త కొత్త సినిమాలు ప్రేక్షకుల ముందుకొస్తుంటాయని తెలిసిందే. ఇప్పటికే దసరా సందర్భంగా రిలీజైన సినిమాలను ఎంజాయ్ చేస్తున్నారు మూవీ లవర్స్. ఇక రాబోయే సీజన్ దీపావళి ఈ సీజన్‌లో కూడా తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు కొత్త ప్రాజెక్టులు వస్తున్నాయి. ఈ సారి ఏకంగా ఆరు సినిమాలు దీపావళి బరిలో నిలుస్తున్నాయి. వాటిపై ఓ లుక్కేస్తే..

క : కిరణ్ అబ్బవరం నటిస్తోన్న పాన్ ఇండియా చిత్రం క 1970స్ ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణగిరి గ్రామం నేపథ్యంలో సాగే పీరియాడిక్ థ్రిల్లర్‌గా పాన్ ఇండియా కథాంశంతో వస్తోంది. సుజిత్–సందీప్ డైరెక్ట్ చేస్తున్న ఈ చిత్రాన్ని డిసెంబర్ 31న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేస్తున్నట్టు ప్రకటించారు.

లక్కీ భాస్కర్ : మాలీవుడ్ స్టార్ హీరో దుల్కర్ సల్మాన్ టైటిల్ రోల్‌లో నటిస్తోన్న చిత్రం 'లక్కీ భాస్కర్' వెంకీ అట్లూరి దర్శకత్వం వహిస్తున్నాడు. తెలుగు, తమిళం, మలయాళం, హిందీ భాషల్లో రాబోతున్న ఈ చిత్రంలో మీనాక్షి చౌదరి హీరోయిన్‌గా నటిస్తోంది. కాగా ఈ చిత్రాన్ని అక్టోబర్ 31న గ్రాండ్‌గా రిలీజ్ చేయనున్నట్ట మేకర్స్ ప్రకటించారని తెలిసిందే.

నిఖిల్ సిద్దార్థ హీరోగా నటిస్తోన్న అప్పుడో ఇప్పుడో ఎప్పుడో సినిమాతోపాటు సత్యదేవ్ నటిస్తోన్న జీబ్రా కూడా దీపావళి కానుకగా థియేటర్లలో సందడి చేయనుంది. మరి ఈ దీపావళి విన్నర్‌గా నిలిచే యాక్టర్ ఎవరనేది ఆసక్తికరంగా మారింది. వీటితోపాటు డబ్బింగ్ సినిమాలు శివకార్తికేయన్ నటిస్తున్న అమరన్, జయం రవి నటిస్తోన్న బ్రదర్ కూడా ఈ రేసులో ఉన్నాయి.




## యోధుడిగా సాయి దుర్గ తేజ్..

### ఎస్‌డిటీ8 గ్లింప్స్ అదిరిందంతే

సాయి దుర్గ తేజ్ కాంపౌండ్ నుంచి వస్తున్న తాజా చిత్రం ఎస్‌డిటీ18. రోహిత్ కేపీ దర్శకత్వం (డెబ్యూ) వహిస్తున్న ఈ మూవీలో ఐశ్వర్య లక్ష్మి ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. మేకర్స్ ముందుగా ప్రకటించిన ప్రకారం ఎస్‌డిటీ18 గ్లింప్స్ షేర్ చేశారు. ధైర్యాన్ని తన కవచంగా, ఆశయే ఆయుధంగా.. అతడు చివరిగా నిలబడి ఉన్నాడు.. అంటూ తిరుగులేని మెగా సుప్రీమ్ హీరోకి మూవీ టీం శుభాకాంక్షలు తెలియజేసింది. సాయి ధరమ్ తేజ్ పవర్‌ఫుల్ పుట్టినరోజు సందర్భంగా ఆర్కాడీ ప్రపంచంలోకి ప్రత్యేక ప్రవేశం.. అంటూ విడుదల చేసిన గ్లింప్స్‌లో సాయి దుర్గ తేజ్ కండలు తిరిగిన దేహంతో శక్తివంతమైన శూలాన్ని పట్టుకొని స్టన్నింగ్ విజువల్స్‌తో పీరియాడిక్ ప్రపంచంలోకి తీసుకెళ్లనున్నట్టు గ్లింప్స్ చెబుతోంది.

ఈ చిత్రాన్ని హనుమాన్ మేకర్స్ ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌లో తెరకెక్కిస్తున్నారు. కె నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి నిర్మిస్తున్నారు. తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో పాన్ ఇండియా చిత్రంగా వస్తోంది. ఈ మూవీలో ఐశ్వర్యలక్ష్మి వసంత పాత్రలో కనిపించనుండగా.. దీనికి సంబంధించిన లుక్ కూడా నెట్టింట వైరల్ అవుతోంది. ఈ చిత్రం 1947 హిస్టరీ బ్యాక్‌డ్రాప్‌లో రాబోతున్నట్టు తెలుస్తుండగా.. సాయి దుర్గ తేజ్ ఒక యోధుడి పాత్రలో నటిస్తున్నట్టు గ్లింప్స్ చెప్పకనే చెబుతోంది.




## ఆర్జీవీ డెన్‌లో

## ఓ యానిమల్‌తో మరో యానిమల్

సోషల్ మీడియాలో ఎప్పుడూ ఏదో ఒక ట్వీట్‌తో వార్తల్లో నిలిచే డైరెక్టర్ల జాబితాలో రాంగోపాల్ వర్మ మొదటి స్థానంలో ఉంటాడని ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. ఆర్జీవీ ఏ కామెంట్ పెట్టినా.. ఫొటో పెట్టినా నెట్టింట తెగ చర్చ జరగడమే కాదు.. అది టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా కూడా నిలుస్తుంటుంది. తాజాగా యానిమల్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగాతో ఉన్న ఫొటోను ఎక్స్‌లో షేర్ చేశాడు వర్మ. ఆర్జీవీ డెన్ యానిమల్ పార్క్‌లో ఓ యానిమల్ మరో యానిమల్‌ను ఇంకొక యానిమల్‌కు చూపిస్తుందంటూ తనదైన శైలిలో ట్వీట్ చేశాడు వర్మ. స్క్రీన్‌పై వర్మ చూపిస్తున్న విజువల్‌ను ఆసక్తిగా చూస్తున్నాడు సందీప్ రెడ్డి వంగా. ఇంతకీ వర్మ యానిమల్ డైరెక్టర్‌కు ఏం చూపిస్తున్నాడన్నది మాత్రం మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది. మరి దీనిపై ఈ ఇద్దరు క్రేజీ దర్శకులు ఏదైనా క్లారిటీ ఇస్తారేమో చూడాలంటున్నారు సినీ జనాలు.

హైదరాబాద్‌లో వర్మ ప్రత్యేకంగా నిర్మించుకున్న ఆర్జీవీ డెన్ ఎంత పాపులర్ అయ్యిందో తెలిసిందే. ఆర్జీవీ డెన్‌కు ఆసక్తిగల దర్శకులు, రైటర్స్, మ్యూజిక్ కంపోజర్స్ కావాలంటూ ఓ ప్రకటన కూడా చేశాడు వర్మ. ఈ ఏడాది వర్మ ప్రభాస్ నటించిన కల్కి 2898 ఏడీలో కామియో రోల్‌లో మెరిసి అందరికీ సర్‌ప్రైజ్ ఇచ్చాడని తెలిసిందే. సందీప్ రెడ్డి వంగా ఖాతాలో యానిమల్ పార్క్, స్పిరిట్ సినిమాలున్నాయి.



## మరో వెబ్ సిరీస్‌కు నాగచైతన్య గ్రీన్ సిగ్నల్

అక్కినేని నాగచైతన్య ఇప్పటికే విక్రమ్ కె.కుమార్ దర్శకత్వంలో 'దూత' వెబ్ సిరీస్ చేశాడని తెలిసిందే. హిందీ, తెలుగు, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో విడుదలైన ఈ సూపర్ నేచురల్ థ్రిల్లర్ సిరీస్‌ను 54వ అంతర్జాతీయ చిత్రోత్సవాల్లో కూడా ప్రదర్శించారు. కాగా ఇప్పుడు చైతూ మరో వెబ్ సిరీస్‌కు సంతకం చేశాడన్న వార్తలు నెట్టింట షికారు చేస్తున్నాయి. అయితే ఈ వార్తలపై పీఆర్వోస్ టీం క్లారిటీ ఇచ్చేసింది. చైతూ కొత్త వెబ్‌సిరీస్‌కు సంతకం చేశాడని వస్తున్న పుకార్లు పూర్తిగా అవాస్తవం. తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేయొద్దని మీడియా సంస్థలకు విజ్ఞప్తి చేస్తున్నాం. నాగచైతన్య ప్రస్తుతం తన ఫోకస్ అంతా తండేల్ సినిమాపైనే పెట్టాడని ఓ ప్రకటన విడుదల చేసింది. 2018లో గుజరాత్ జరిగిన వాస్తవ ఘటనల ఆధారంగా తెరకెక్కుతున్న తండేల్‌ను చందూమొండేటి డైరెక్ట్ చేస్తున్నాడు. ఈ మూవీని గీతాఆర్ట్స్‌పై అల్లు అరవింద్ సమర్పణలో బన్నీవాసు తెరకెక్కిస్తుండగా.. అనిరుధ్ రవిచందర్ మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. మేకర్స్ ఇప్పటికే తండేల్ నుంచి లాంఛ్ చేసిన ఫస్ట్ లుక్‌లో చైతూ మత్స్యకారుడిగా మాస్ లుక్‌లో కనిపిస్తుండగా.. సాయిపల్లవి శ్రీకాకుళం అమ్మాయి సత్య పాత్రలో కనిపించనుంది.

Printed Published Edited and Owned by Chegonda Ravikumar Yadav.Printed at Sri Laxmi Printing Press H.NO.4_6_157 Peddapalli Pin co.505172 State Telangana
TITLE CODE:TELTEL02040 EDITOR: Chegonda Ravikumar Yadav Contact Number.8008817828. Email.agnidharanews@gmail.com http://www.agnidharanews.com